1st Year Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health

Best for Readers

THE POWER OF IRK PEN

సంపుటి : 3 సంచిక : 97 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 12 ఏప్రిల్ 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE :97 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Sunday 12 April 2026 PAGES : 8 PRICE : 3/-

బెంగాల్ ఉత్సాహం గుజరాత్‌లోనూ చూడలేదు ప్రధాని మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 11)

పశ్చిమ బెంగాల్‌లో తన ప్రచార సభలకు వస్తున్న జనాన్ని, వారి ఉత్సాహాన్ని తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో కూడా ఎన్నడూ చూడలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈరోజు మధ్యాహ్నం తూర్పు బర్ధమాన్ జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంత భారీ సభను గుజరాత్‌లో కూడా ఏర్పాటు చేయలేకపోయేవారమని, మే 4 తర్వాత రాష్ట్రంలో మార్పులు రాబోతున్నాయనడానికి ఈ సభలే నిదర్శనమని అన్నారు. బీజేపీ వస్తే టీఎంసీ 15 ఏళ్ల అవినీతిపై శ్వేతపత్రం: మోదీ హామీ ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్‌పై మోదీ తీవ్ర విమర్శలు చేశారు. బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే, గత 15 ఏళ్ల టీఎంసీ పాలనలో జరిగిన అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని టీఎంసీ భయాందోళనలు సృష్టిస్తోందని, ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా నిలిపివేయబోమని స్పష్టం చేశారు. కేవలం తృణమూల్ నేతల అవినీతి, దోపిడీ దుకాణాలను మాత్రమే మూసివేస్తామని అన్నారు. ▶మిగతా 2లో

మంత్రి టీజీ భరత్ జిమ్ వీడియోపై నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 11)

ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌పై ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆసక్తికరమైన రీతిలో ప్రశంసలు కురిపించారు. జిమ్‌లో టీజీ భరత్ కఠినమైన వ్యాయామాలు చేస్తున్న వీడియోను షేర్ చేసిన లోకేశ్, ఆయన కసరత్తులను రాష్ట్రంలో పెట్టుబడుల వాతావరణంతో ముడిపెడుతూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తి కలిగిస్తున్నాయి.టీజీ భరత్ జిమ్‌లో జంపింగ్స్ తో కూడిన వర్కౌట్ చేస్తున్న వీడియోను నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ వీడియోకు ఆయన ఓ ఆసక్తికరమైన వ్యాఖ్యను జోడించారు. ▶మిగతా 2లో


రాజధాని అంటే వైకాపాకు నవ్వులాటలా ఉంది



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 11)

'రాజధాని అమరావతి విషయంలో వైకాపా అధినేత జగన్ మూడు ముక్కలాట పూర్తిచేసి, ఇప్పుడు మూడు అక్షరాల ఆట ప్రారంభించారు. రాజధాని అంటే ఆ పార్టీ నేతలకు నవ్వులాటలా ఉంది' అని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మండిపడ్డారు. శ్రీకాకుళంలోని తెదేపా జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. 'రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా అమరావతికి ▶మిగతా 2లో

జగన్ విమర్శలకు అమరావతి అభివృద్ధే సమాధానమిస్తుంది




(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 11)

పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చారు. పార్టీ నాయకుల శిక్షణ తరగతుల్లో సీఎం స్వయంగా పాల్గొన్నారు. అనంతరం మీడియాతో కొద్దిసేపు ముచ్చటించారు. "జగన్ మావిగన్ విమర్శలకు అమరావతి అభివృద్ధే సరైన సమాధానం ఇస్తుంది. పిచ్చిపట్టినట్లు చేసే మావిగన్ ప్రకటనలకు ప్రజలే సమాధానం చెబుతారు. అభివృద్ధి అనేది ఒకచోట ఆగేది కాదు. ▶మిగతా 2లో

టీడీపీ కార్యాలయంలో శిక్షణా తరగతులు...

క్రమం తప్పకుండా హాజరవుతున్న చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 11)

ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ, వారిలో నూతనోత్సాహం నింపుతున్నారు. అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు ఆయన క్రమం తప్పకుండా హాజరవుతూ పార్టీ శ్రేణులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. అదే సమయంలో, పార్టీ శ్రేణులకు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత ఇస్తున్నారు.

ఈ సందర్భంగా కార్యకర్తల ఆర్థిక స్వావలంబన కోసం 'జు3' (ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్) అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన ప్రకటించారు. పార్టీ సీనియర్ నేతల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణా శిబిరాల్లో చంద్రబాబు చాలా చురుగ్గా పాల్గొంటున్నారు. శిక్షణ తీసుకుంటున్న నేతలు, కార్యకర్తలతో కలిసి కాఫీ తాగుతూ, వారితో నేరుగా సంభాషిస్తున్నారు. ఈ సందర్భంగా రాజకీయ, పరిపాలన అంశాలపై తన సుదీర్ఘ అనుభవాన్ని పంచుకుంటున్నారు. గతానుభవాలు, ప్రస్తుత ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలను వారికి వివరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలు తీరుపై కార్యకర్తల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ స్వీకరిస్తున్నారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "క్లీన్ అండ్ గ్రీన్, క్లీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్న మనం, క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నాం. క్లీన్ పాలిటిక్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా టీడీపీని నిలిపేలా ప్రతి కార్యకర్త పనిచేయాలి. పాజిటివ్ పాలిటిక్స్ చేస్తూ, పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలి. గతంలో కంటే టీడీపీ ఓటు బ్యాంకు పెరగాలి," అని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా ▶మిగతా 2లో

పులివెందులకు 'అవి గొడ్డలి' పేరు పెట్టండి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 11)

అమరావతికి జగన్ పేరుతో మావిగన్ పెట్టారు సరే.. పులివెందులకు అవినాష్ పేరుతో 'అవి గొడ్డలి' అని పెట్టాలని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సూచించారు. జగన్ పేరులో గన్, అవినాష్ పేరులో వినాశనం ఉన్నాయని ఆమె వ్యాఖ్యానించారు. మావిగన్ అద్భుతమైన ఐడియా అయితే ఐదేళ్లూ అధికారంలో ఉండి ఎందుకు అమలు చేయలేదని జగన్‌ను నిలదీశారు. ఉపాధిహామీ పథకాన్ని పునరుద్ధరించాలని సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురంలో నిర్వహించిన పాదయాత్రలో పాల్గొన్న షర్మిల విలేకర్లతో మాట్లాడారు. ▶మిగతా 2లో

మహాత్మా పులే జ్ఞాపకం కాదు.. ఓ మార్గదర్శి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 11)

ఏప్రిల్ 11కు మనందరి దృష్టిలో ఓ ప్రత్యేకత ఉంది. ఎందుకంటే భారత్‌లో ఉద్భవించిన సంఘ సంస్కర్తలందరిలో అగ్రగణ్యుడుగా అందరికీ వెలుగుబాట చూపిన మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు ఫులే జయంతి ఇవాళ! ఆయన ద్విశతాబ్ది ఉత్సవాలు ఈరోజే ప్రారంభమవు తుండటం మరింత ప్రత్యేకత. మహాత్మా ఫులే ఒక గొప్ప సంస్కర్త. అంతేకాదు నైతిక స్థైర్యానికి, నిరంతర శోధనకు ప్రతీకగా నిలిచిన ఆయన సమాజ శ్రేయస్సు పట్ల అచంచల నిబద్ధతతో జీవనం సాగించారు. ▶మిగతా 2లో

బీసీల సమస్యలపై ప్రధాని మోదీతో చర్చిస్తా

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 11)

దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడానికి తమ పార్టీ, ప్రభుత్వం తరఫున ప్రధాని మోదీతో చర్చిస్తానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సచివాలయంలో శుక్రవారం తనను కలిసిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు కేసిన శంకర్‌రావు, ఇతర 29 సంఘాల బీసీ ప్రతినిధులకు ఈ మేరకు హామీనిచ్చారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాల్సిన 30 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని చంద్రబాబుకు అందించారు. అనంతరం జాజుల శ్రీనివాస్, కేసిన శంకర్‌రావులు విలేకరులతో మాట్లాడారు. 'దేశవ్యాప్తంగా కులగణన పూర్తయ్యాకే నియోజకవర్గాల పెంపు, ▶మిగతా 2లో

ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్-అమెరికా చర్చలకు సర్వం సిద్ధం




(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 11)

పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి స్థాపనే లక్ష్యంగా అమెరికా, ఇరాన్ మధ్య కీలక చర్చలకు అంతా సిద్ధమైంది. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ ఈ చర్చలకు వేదికగా నిలిచింది. ఈ చర్చల ప్రారంభం సందర్భంగా అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, పాకిస్థాన్ ప్రధానమంత్రి ముహమ్మద్ షెహబాజ్ షరీఫ్‌తో శనివారం సమావేశమయ్యారు. ఈ భేటీలో వాన్స్‌తో పాటు అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ పాల్గొన్నారు. ప్రధాని షరీఫ్‌కు సహాయకులుగా ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్, అంతర్గత వ్యవహారాల మంత్రి మోహసిన్ రజా నఖ్వీ హాజరయ్యారు. ఇరు దేశాల ప్రతినిధులు నిర్మాణాత్మక ధోరణితో చర్చల్లో పాల్గొనేందుకు ముందుకు రావడం పట్ల పాక్ ప్రధాని ప్రశంసించారు.ఈ చర్చలు ఈ ప్రాంతంలో సుస్థిర శాంతికి ఒక మెట్టుగా నిలుస్తాయని షెహబాజ్ షరీఫ్ ఆశాభావం వ్యక్తం చేశారు. శాంతి పునరుద్ధరణ కోసం ఇరు దేశాలకు తమ సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు. అంతర్జాతీయంగా ఉత్కంఠ రేపుతున్న ఈ చర్చల ద్వారా శాంతియుత పరిష్కారం లభిస్తుందని పలు దేశాలు ఆశిస్తున్నాయి.

ప్రభుత్వ నియమాల ప్రకారం సింహాచలం అప్పన్న చందనోత్సవం: మంత్రి ఆనం

(షణ్ముఖ వెలుగు, విశాఖపట్నం,ఏప్రిల్ 11)

ప్రభుత్వ నియమాల ప్రకారం సింహాచలం శ్రీవరాహలక్ష్మీ నరసింహస్వామి చందనోత్సవం నిర్వహిస్తామని ఏపీ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులకు తొలుత నిజరూప దర్శనం కల్పిస్తామన్నారు. సింహాచలం చందనోత్సవ ఏర్పాట్లపై మంత్రులు అనిత, బాలవీరాంజనేయస్వామితో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భక్తులు స్లాట్‌ల ప్రకారమే దర్శనాలకు రావాలని సూచించారు. అప్పటికప్పుడు వచ్చే భక్తులకు కొన్ని ఇబ్బందులు రావొచ్చని తెలిపారు. ఒకసారి క్యూలైను నిండితే 25వేల మంది దర్శనాలు చేసుకోవచ్చని అన్నారు. ఈసారి 70శాతం టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. సింహాచలం క్షేత్రం లో ఈ నెల 20న చందనోత్సవం జరగనుంది. ▶మిగతా 2లో



పశ్చిమాసియాలో సత్వరం శాంతి నెలకొనాలి



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 11)

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు తీవ్ర ఆందోళనకరమని భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. అక్కడ సత్వరం శాంతి నెలకొనాల్సిన అవసరముందన్నారు. పౌరులపై దాడులను, అంతర్జాతీయ వాణిజ్య రవాణా మార్గాలకు ఆటంకం కల్పించడాన్ని భారత్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మారిషస్ రాజధాని పోర్ట్ లూయిస్‌లో శుక్రవారం నిర్వహించిన 'ఇండియన్ ఓషన్ కాన్ఫరెన్స్'లో ఆయన ఈ మేరకు ప్రసంగించారు. అంతర్జాతీయ సముద్ర జలాల్లో స్వేచ్ఛాయుత రవాణా తక్షణావసరమని పేర్కొన్నారు. ఈ సదస్సులో నేపాల్, భూటాన్, సీషెల్స్ దేశాల విదేశాంగ మంత్రులతో జైశంకర్ భేటీ అయ్యారు.

మారిషస్ అధ్యక్షుడితో భేటీ : మారిషస్ అధ్యక్షుడు ధరంబీర్ గోఖూల్‌తో జైశంకర్ సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంపై వారు చర్చలు జరిపారు.

పొదిలిలో ఘనంగా జ్యోతిబాపూలే జయంతి





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 11)
పొదిలి పెన్షనర్స్ అసోసియేషన్ భవనం నందు మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతిని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ బాదుల్లా, కార్యదర్శి షేక్ మదార్ వలి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇటీవల మరణించిన విశ్రాంత ఉద్యోగులు చీమలమర్రి రాధాకృష్ణమూర్తి, పాశం బాలయ్య, టిసిహెచ్ చెంచయ్య, షేక్ బాషాలకు నివాళులర్పించారు. అనంతరం జ్యోతిబాపూలే చిత్రపటానికి నాయకులు ఓ వీరారెడ్డి, ఎ బాదుల్లా, షేక్ మదార్ వలి, సిహెచ్ వి సుబ్బారావు, దాసరి గురుస్వామి, మోహన్‌రావు, కార్యక్రమానికి హాజరైన విశ్రాంత ఉద్యోగులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభా కార్యక్రమం నందు అధ్యక్షులు బాదుల్లా, కార్యదర్శి మదార్ వలి మాట్లాడుతూ విద్య లేకపోతే జ్ఞానం లేదు. జ్ఞానం లేకపోతే నైతికత లేదు నైతికత లేకపోతే ఐకమత్యం లేదు. ఐకమత్యం లేకపోతే శక్తి లేదు.కనుక ఇవన్నీ విద్య ద్వారానే పొందగలమని నిరూపించిన చదువుల ప్రధాత మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. అనంతరం పొదిలి తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ కన్వీనర్ దాసరి గురుస్వామి మాట్లాడుతూ పెన్షనర్స్ యొక్క సమస్యలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటి తీరుస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని అభినందనలు తెలియజేశారు. తదుపరి గౌరవ అధ్యక్షులు కె ఎల్ నరసింహ, కోశాధికారి సుబ్బారావు మాట్లాడుతూ పెన్షనర్స్ కు రావలసిన సెలవు బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆదివారం పట్టణంలోని గీతాంజలి పాఠశాల ఆవరణలో జరుగు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పొదిలి తాలూకాలోని పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంలో ఆయనకు లేరెవరు సాటి

(షణ్ముఖ వెలుగు, పామూరు, ఏప్రిల్ 11)



పామూరులో రవణమ్మ మెమోరియల్ మల్లికార్జునరెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండి డాక్టర్ పి మల్లికార్జునరెడ్డి ఎముకలు, కీళ్ల వ్యాధుల వైద్య నిపుణులుగా వైద్య సేవలు అందిస్తున్నారు. అయితే ఆయనకు పేదలంటే ప్రాణం. ఆయనకు వచ్చిన మొత్తంలోనే యువ సముద్రం ఫౌండేషన్, నెక్స్ జెన్ రోబోటిక్స్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తూ పేదలకు ఉచితంగా వైద్యం అందించడం ఆయన ప్రత్యేకత. అంతే కాదు ట్రస్ట్ ద్వారా ఉచిత అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించడం ఆయన దాన, జాలి గుణనుడు అని చెప్పక తప్పదు. అందులో భాగంగా శనివారం పామూరులో పోలీస్ స్టేషన్ సమీపాన ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించి పేద ప్రజల మన్ననలను పొందారు. ఈ సందర్భంగా ఉదయగిరి వైసీపీ యువ నాయకులు కల్లూరి రాజారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ మల్లికార్జునరెడ్డి ఇప్పటికీ పలుచోట్ల సుమారు 25కు పైగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారని, 15కు పైగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు. వైద్యం పేరుతో దోచుకుండే డాక్టర్లను చూసాం కానీ క్యాంపుల ద్వారా ఉచిత వైద్యం, ఆకలి తీర్చేందుకు అన్నదానం నిర్వహించడం ఆయన విధానమని, ఆయనకు ఎవరూ సాటి లేరన్నారు.

బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా పూలే జయంతి వేడుకలు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 11)
ఉలవపాడు మండల శాఖ బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే జయంతి వేడుకల్లో పూలే చిత్ర పటానికి ఉలవపాడుపాడు మండల విద్యాశాఖ అధికారులు పివీ రత్నం, పీవీ రమణయ్యలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు పూలే చేసిన సేవలను, పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిటిఏ మండల శాఖ అధ్యక్షుడు పున్నేపల్లి శ్రీను, శోభన్‌బాబు, కోటేశ్వరరావు, ఎద్దు మాల్యాద్రి, రమేష్, దార్ల కోటేశ్వరరావు, ప్రభాకర్, రాజశేఖర్, మెడికొండ భాస్కర్‌లు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

టీడీపీ కార్యాలయంలో శిక్షణా తరగతులు...

చెప్పాలని సూచించారు.కార్యకర్తల ఆర్థిక బలోపేతంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సీఎం తెలిపారు. "పార్టీ నేతలు, కార్యకర్తల కోసం జు3 ప్రోగ్రాం తీసుకొస్తాం. నీతి, నిజాయతీలతో కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్' కార్యక్రమం చేపడతాం" అని హామీ ఇచ్చారు. "నా కుటుంబం కోసం ఏ విధంగా ఆలోచించానో, టీడీపీ కుటుంబం కోసం కూడా అదే విధంగా ఆలోచిస్తున్నాను" అని ఆయన పేర్కొనడం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రత్యర్థి పార్టీల తీరును సమర్థంగా విశ్లేషించేలా అవగాహన పెంచుకోవాలని కూడా ఆయన దిశానిర్దేశం చేశారు.

బెంగాల్ ఉత్సాహం గుజరాత్‌లోనూ చూడలేదు: ప్రధాని మోదీ

తాము అధికారంలోకి వస్తే, కొత్త ముఖ్యమంత్రి నేతృత్వంలోని తొలి కేబినెట్ సమావేశంలోనే రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ పథకం అమలుకు తీర్మానం చేస్తామని మోదీ ప్రకటించారు. ఇన్నాళ్లూ ఈ పథకాన్ని అమలు చేయకుండా తృణమూల్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిందని, బీజేపీ ప్రభుత్వంతో ఆ రోజులు ముగిసిపోతాయని తెలిపారు.

చొరబాటుదారులు, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు

అంతేగాక కొత్త ప్రభుత్వం చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, వారికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఇక్కడ స్థిరపడటానికి సహాయం చేసిన వారిని కూడా వదిలిపెట్టబోమని మోదీ హెచ్చరించారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

మంత్రి టీజీ భరత్ జిమ్ వీడియోపై నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు

"రాష్ట్రంలో అత్యుత్తమ పెట్టుబడి వాతావరణాన్ని అందించడానికి మా పరిశ్రమల మంత్రి టీజీ భరత్ గారు ఇలా అడ్డంకులను దాటుతున్నారు" అంటూ లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు.ఈ వ్యాఖ్యలతో పాటు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', 'చూజ్ స్పీడ్ చూజ్ ఏపీ' అనే హ్యాష్‌ట్యాగ్‌లను కూడా జతచేశారు.

ప్రభుత్వ నియమాల ప్రకారం సింహాచలం అప్పన్న చందనోత్సవం: మంత్రి ఆనం

ఆ రోజు దాదాపు 1.50 లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకునే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన చర్యలు తీసుకోవాలని హోం మంత్రి అనిత అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సామాన్య భక్తుల దర్శనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.

మహాత్మా పులే జ్ఞాపకం కాదు.. ఓ మార్గదర్శి

ఆయన నిర్మించిన వ్యవస్థలు, నేతృత్వం వహించిన ఉద్యమాల కారణంగా మనందరం నేటికీ మహాత్మా ఫులేను స్మరించుకుంటున్నాం. గొప్ప రాష్ట్రం మహారాష్ట్రలో 1827లో జన్మించిన మహాత్మా ఫులే నిరుపేదగా జీవితం ప్రారంభించారు. ప్రారంభంలో ఎదురైన కష్టాలు ఆయన విజ్ఞాన సముపార్జన తృష్ణకు, ధైర్యానికి, సామాజిక నిబద్ధతకు ఆటంకం కలిగించలేకపోయాయి. పాఠశాల స్థాయి నుంచే ఫులేలో లోతైన జ్ఞాన తృష్ణ ఉండేది. "మనలో ఎన్ని ప్రశ్నలు ఉదయిస్తే అంత పరిజ్ఞానం చేకూరుతుంది" అని ఆయన తదనంతర జీవితంలో చేసిన వ్యాఖ్య అక్షర సత్యం. బాల్యం నుంచే ఫులేలో చిగురించిన వైజ్ఞానిక జిజ్ఞాస జీవన పర్యంతం ఆయన వెంట నిలిచింది.విద్యా సముపార్జనలోని ఆనందాన్ని అనుభవించే అవకాశం పలువురికి లేని రోజుల్లో బాలికల కోసం, లాంఛన విద్యా వ్యవస్థ చట్రంలో లేని వర్గాల కోసం ఆయన పాఠశాలలు ప్రారంభించారు. సమాజంలో అందరికీ సమాన హక్కులు దక్కే వరకూ నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించదు అని మహాత్మా ఫులే దృఢంగా విశ్వసించారు. ఈ ఆలోచనను ఆచరణలోకి తేగల వ్యవస్థలను నిర్మించి సామాజిక న్యాయానికి దోహదపడ్డారు. ఆయన స్థాపించిన "సత్యశోధక్ సమాజ్" ఆధునిక భారతంలో ఉద్భవించిన అతిముఖ్యమైన సంఘ సంస్కరణోద్యమం. సత్యశోధక్ సమాజ్ మహిళలకు, యువతకు, గ్రామీణులకు గళాన్నిచ్చింది. ప్రతి ఒక్కరికీ న్యాయం, గౌరవం అందించడం ద్వారా, సమష్టిగా పురోగతి సాధించాలన్న స్పృహ పెంపొందించడం ద్వారా సమాజాన్ని బలోపేతం చేయవచ్చన్న ఫులే విశ్వాసాన్ని ప్రతిబింబించింది.ధైర్యంగా ఎలా బతకాలో ఫులే వ్యక్తిగత జీవితం మనకు నేర్పుతుంది. అనారోగ్యం ఎన్ని సవాళ్లు విసిరినా ఆయన సంకల్పం బలహీన పడలేదు. తీవ్ర అనారోగ్య పరిస్థితిలోనూ ఆయన తన కలల సాకారం కోసం పనిచేశారు. పోరాటాల ద్వారా స్థైర్యం పొందే ఎందరికో స్ఫూర్తినందించిన జీవన పార్శ్వమిది.

మనదేశంలో ఉదయించిన అతిపెద్ద సాంఘిక సంస్కర్తల్లో ఒకరైన సావిత్రీబాయి ఫులే ప్రస్తావన లేకుండా మహాత్మా ఫులే సంస్మరణ సంపూర్ణం కాదు. మహిళా ఉపాధ్యాయుల్లో మొదటివారిగా ఆమె బాలికా విద్యను ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషించారు. మహాత్మా ఫులే అస్తమయం తర్వాత ఆయన ఆశయాలను సావిత్రీబాయి ముందుకు తీసుకెళ్లారు. 1897లో దేశంలో ప్లేగు మహమ్మారి తలెత్తినప్పుడు ఆమె వ్యాధిగ్రస్తులకు నిబద్ధతతో సేవలందించారు. ఆ క్రమంలో స్వయంగా ప్లేగు వ్యాధి బారినపడి ప్రాణాలు కోల్పోయారు.మన నేలపై ఎందరో మహనీయులు ఉద్భవించి తమ ఆలోచనలు, త్యాగాలు, ఆచరణల ద్వారా సమాజాన్ని బలోపేతం చేశారు. బలహీనుల వేదనను విధిలిఖితంగా భావించడానికి నిరాకరించిన ఎందరో మహనీయులు శతాబ్దాలుగా సామాజిక మార్పు కోసం పిలుపునిస్తూ వచ్చారు. అలాంటి మహనీయుల కోవలో మహాత్మా జ్యోతిరావు ఫులే అగ్రభాగాన నిలుస్తారు.2022లో నేను పుణె సందర్శించినప్పుడు మహాత్మా ఫులే విగ్రహానికి నివాళులర్పించిన సందర్భం నాకు బాగా గుర్తు. ఫులే ద్విశతాబ్ది ఉత్సవాలు ప్రారంభమవుతున్న ఈ సందర్భంలో ఆయన మనసుకు దగ్గరగా నిలిచిన ఆశయాల సాధనకు పునరంకితం కావడమే ఆ మహనీయునికి మనం అర్పించే నిజమైన నివాళి. అన్యాయాన్ని సహించరాదన్న భావనకు పునరంకితం కావడమే ఆయనకు మనం అర్పించగల నిజమైన నివాళి.

బీసీల సమస్యలపై ప్రధాని మోదీతో చర్చిస్తా

మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలి. జనగణనలో భాగంగానే బీసీ కులగణన చేపట్టాలి. మహిళా రిజర్వేషన్ బిల్లులోనే బీసీ మహిళలకు ప్రత్యేక ఉపకోటా ఉండేలా చూడాలి. ఈ విషయాలపై ప్రధాని మోదీతో చర్చించాలని సీఎం చంద్రబాబును కోరాం. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రక్షణ చట్టం తీసుకురావడం అభినందనీయం. ఈ చట్టం న్యాయస్థానాల్లో వీగిపోకుండా పగడ్బందీగా రూపొందించాలి. రాజధాని అమరావతిలో మహాత్మా జ్యోతిబా ఫులే స్మృతివనం ఏర్పాటుకు వంద ఎకరాలు కేటాయించాలి' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, మహారాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు పవన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రాజధాని అంటే వైకాపాకు నవ్వులాటలా ఉంది

లోక్‌సభలో అన్ని పార్టీలూ మద్దతు పలికాయి. విభజనకు కారణమైన కాంగ్రెస్ పార్టీ కూడా ఆమోదించింది. వైకాపా మాత్రం మద్దతివ్వకుండా వాకౌట్ చేసింది. ఈ విషయంలో ఆ పార్టీ నేతలు చరిత్రహీనులుగా మిగిలిపోతారు. రాష్ట్రంపై జగన్, వైకాపా నేతల కక్ష, విధ్వంసం, విషం ఎలా ఉంటాయో చెప్పడానికి ఇదో ఉదాహరణ. అమరావతిని అభివృద్ధి చేస్తే చంద్రబాబుకు ఎక్కడ పేరొస్తుందోనని వైకాపా నేతలు విషం చిమ్ముతున్నారు. రాష్ట్రాభివృద్ధికి ఏం కావాలన్నా కేంద్రం సహకరిస్తోంది. వైకాపా నేతలు మాత్రం నాశనం కావాలని గుంటనక్కల్లా ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రానికి రాజధాని అమరావతి అని చెప్పి అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందాలని భావించాం. అందుకే గూగుల్, ఆర్సెలార్ మిత్తల్, బ్లాక్‌స్టోన్ పార్కు, మూలపేట పోర్టు, విమానాశ్రయాలు, టీసీఎస్, కాగ్నిజెంట్ లాంటివి ఉత్తరాంధ్రకు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నాం. భోగాపురం విమానాశ్రయాన్ని ప్రధాని చేతులమీదుగా జులై 5న ప్రారంభించాలని యోచిస్తున్నాం' అని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

జగన్ విమర్శలకు అమరావతి అభివృద్ధే సమాధానమిస్తుంది

హైదరాబాద్‌కు ఓఆర్ఆర్, ఎయిర్‌పోర్టు, ఐటీ రంగం ఆదాయాన్ని పెంచాయి. సైబరాబాద్ వల్ల హైదరాబాద్ అభివృద్ధి చెందుతూనే ఉంది. అమరావతి కూడా ఇదే తరహాలో అభివృద్ధి చెందుతుంది" అని సీఎం స్పష్టం చేశారు.

పులివెందులకు 'అవి గొడ్డలి' పేరు పెట్టండి

ఎంతసేపూ నరకాలి, చంపాలి, నాశనం చేయాలనేది వైకాపా సిద్ధాంతమని ఆమె మండిపడ్డారు. 'జగన్ అధికారంలోకి రాగానే ప్రజావేదిక కూల్చారు. ఇప్పుడు అమరావతి వద్దట. మావిగన్ పెడతారట. దానిపై కాంగ్రెస్ వైఖరేంటో చెప్పాలని వైకాపా అడుగుతోంది. ఎవరైనా ఈ జోక్ వింటే నవ్వుతారు. మా నవ్వే మావిగన్‌పై మా వైఖరి. దానిపై కొత్తగా చెప్పడం అనవసరం. మావిగన్ జోక్ అంటే నన్ను కూటమి దత్తపుత్రిక అంటున్నారు. పచ్చకామెర్లు కమ్మినోడికి లోకమంతా పచ్చగా ఉంటుందట' అని షర్మిల విమర్శించారు.

అమరావతికి పూర్తి మద్దతిస్తున్నాం

'చంద్రబాబుతో ఏనాడూ అక్రమ పొత్తు పెట్టుకొనే పరిస్థితి మాకు లేదు. మీలా భాజపాకు మద్దతిస్తున్నవాళ్లం కాము. అమరావతిపై కాంగ్రెస్ వైఖరి ఇప్పటికే స్పష్టం చేశాం. పార్లమెంటులో బిల్లుకు మద్దతిచ్చి అప్పులు ఇవ్వొద్దని చెప్పాం. అమరావతి నిర్మాణం కేంద్రం బాధ్యత. విభజన హామీలు నెరవేర్చాలి. అమరావతికి పూర్తి మద్దతు ఇస్తున్నాం. కాంగ్రెస్ నుంచి ఏ సహాయం కావాలన్నా చేస్తాం' అని షర్మిల అన్నారు.

విజయమ్మను అవమానించిన బొత్స ఎంత ఏడ్చినా తక్కువే

'నిండు అసెంబ్లీలో విజయమ్మను వైకాపా నేత బొత్స సత్యనారాయణ అవమానించారు. వైఎస్సార్‌ను చులకన చేసి మాట్లాడి మా అమ్మతో కంటతడి పెట్టించారు. ఇంటికి వచ్చి అమ్మ చాలా బాధపడింది. అందుకు నేనే సాక్షి. అంతలా విజయమ్మను బొత్స బాధ పెట్టారు. ఆయన ఎంత ఏడ్చినా తక్కువే. విజయమ్మకు బొత్స బహిరంగ క్షమాపణ చెప్పాలి' అని షర్మిల డిమాండ్ చేశారు. వైఎస్సార్ మరణం వెనుక జగన్ హస్తం ఉందని బొత్స గతంలో మాట్లాడారు కదా అని విలేకరులు అడగ్గా.. అవన్నీ తనకు తెలియదన్నారు.

సామాజిక విప్లవ జ్యోతిబాపూలే

జిల్లా కలెక్టర్ విజయ సునీత



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 11)
దాదాపు 200 సంవత్సరాల క్రితమే సమాజంలోని అణగారిన వర్గాలు, మహిళల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం కృషి చేసి సమ సమాజ స్థాపనకు పాటుపడిన జ్యోతిబాపూలే భావితరాలకు ఆదర్శంగా నిలిచిపోతారని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత పేర్కొన్నారు. మార్కాపురం పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో శనివారం పూలే 200 జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యాలయంలో ఉన్న పూలే విగ్రహానికి, చిత్రపటానికి కలెక్టర్, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఇతర అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అప్పటి సమాజంలో కుల వివక్షత, అంటరానితనం, మూఢనమ్మకాలు రూపు మాపడడానికి విశేష కృషి చేసిన ఘనత పూలే కే దక్కుతుందన్నారు. అదేవిధంగా 1848 వ సంవత్సరంలో దేశంలో మొదటిసారి బాలికల పాఠశాలను తన సతీమణి సావిత్రిబాయి తో కలసి ఏర్పాటుచేసి మహిళ విద్యకు జీవం పోశారని కొనియాడారు. తన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఆనాటి పరిస్థితులపై పోరాటం చేసి సఫలీకృతులయ్యారని తెలిపారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూడా పూలేను తన గురువుగా ప్రకటించుకొని ఆయన బాటలో నడిచారని తెలిపారు. అంతటి గొప్ప మహనీయున్ని భావితరాలు గుర్తించుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ కె వెంకటేశ్వర్లు, ఈఈ పి వి నాగేశ్వరరావు, డిఈఈ షియా నాయక్, బీసీ వెల్ఫేర్ అధికారి ఖాసిం వలి, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.













షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
12.04.26 ఆదివారం

సిలిండర్ల బ్లాక్ మార్కెట్‌కు ప్రభుత్వం చెక్?

- ఈ పాటికే ఓటిపిలతో 70 శాతం బ్లాక్ మార్కెట్‌కు కళ్ళెం
- ఆన్‌లైన్‌లో సిలిండర్ల సీరియల్ నెంబర్లతో నూరు శాతం బ్లాక్ మార్కెట్ కు చెక్
- మొన్నటి వరకు డీలర్లు, డెలివరీ బాయ్స్ పైన నిందలు
- నేడు వినియోగదారుడే సిలిండర్ల విక్రయం
- ప్రభుత్వ నూతన నిబంధనలతో ఒక్క సిలిండర్ కూడా బ్లాక్ కు వెళ్ళడం కష్టమే
- త్వరలో డీలర్ల సలహా తీసుకోనున్న ప్రభుత్వం
- సిలిండర్ల సీరయల్ నెంబర్లు లేకుంటే కట్టెల పొయ్యే దిక్కు
- మరి వినియోగదారుడు ఏ దార్లు వెతుకుతాడో చూడాలి



(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, ఏప్రిల్ 11)

ప్రపంచంలోని పశ్చిమాసియాలో గత నెల రోజులకు పైగా జరుగుతున్న యుద్ధ వాతావరణం ఇప్పుడప్పుడే సద్దుమణిగే పరిస్థితి లేదు. దీంతో గ్యాస్ నిల్వలు రోజు రోజుకు తగ్గుముఖం పట్టే అవకాశాలు లేకపోలేదు. ఈ పాటికే ఆయిల్ కంపెనీలు, ప్రభుత్వాలు గ్యాస్ సిలిండర్ల సరఫరాకు అనునిత్యం శ్రమిస్తూ ఒక పాలసీ ప్రకారం సరఫరా చేస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తున్నాయి. అయితే తొలి సారిగా కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ సిలిండర్లను పూర్తిగా రద్దు చేయడంతో గ్యాస్ కష్టాలు ప్రారంభమయ్యాయి. యుద్ధం రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో మొట్ట మొదటగా ప్రభుత్వం ఓటిపిలు ఉంటేనే గ్యాస్ సరఫరా చేయాలని సూచించింది. దీంతో డీలర్లు కొంత ఇబ్బందులు మొదట్లో పడినప్పటికీ ఓటిపిల ద్వారా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయడంతో తమ పై ఇప్పటి వరకు పడుతున్న నిందల నుంచి తప్పుకున్నారు. ఇక మిగిలింది డెలివరీ బాయ్స్... వారు కూడా కొంత మేర బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్ సిలిండర్లను విక్రయించడం తగ్గించారు. ఇదే అదునుగా భావించిన వినియోగదారుడు తనకు ఓటిపి వచ్చింది అంటే చాలు తనకు రూ.2 వేలు లాభం పొందినట్లే. కమర్షియల్ సిలిండర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిన తర్వాత కూడా పెద్ద పెద్ద హోటళ్ళ దగ్గర నుంచి చిన్న చిన్న హోటళ్ళ వరకు యధావిధిగా నడుస్తూనే ఉన్నాయి. అంటే ఎక్కడ కూడా గ్యాస్ ఇబ్బంది లేదని తెలుస్తుంది. ఓ వైపు కమర్షియల్ సిలిండర్లు లేకపోయినా డెలివరీ బాయ్స్, డీలర్లు గ్యాస్ సిలిండర్లను ఎవరికీ అక్రమంగా అందించకపోయినా హోటళ్ళు మాత్రం యదావిధిగా నడుస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కాని ఆ పరిస్థితిని అధికారులు అర్థం చేసుకున్న దాఖలాలు లేవు. కనీసం జిల్లాలో నామమాత్రంగా కూడా ఇప్పటి వరకు హోటళ్ళ పై దాడులు చేసిన దాఖలాలు లేవు. కేవలం ఎవడో ఒకడు అంతర్గతంగా దాచి ఉంచి విక్రయిస్తున్న దళారులను పట్టుకుని సిలిండర్లను సీజే చాశారే తప్ప హోటళ్ళ పై దాడులు చేసి సిలిండర్లను స్వాధీనం చేసుకున్న ఘటనలు అంతంతమాత్రమే....ఇదే వినియోగదారులకు వరంగా మారింది. తాము ఎంతకు విక్రయించుకున్నా తమను అడిగే వాడు ఎవరూ లేరని భావించారు. ఈ విషయాలన్నింటిని నిశితంగా గమనిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు వినియోగదారుడు చేస్తున్న బ్లాక్ మార్కెట్‌కు కూడా చెక్ పెట్టేందుకు శాశ్వత ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తుంది. గత రెండు రోజుల క్రితం రాష్ట్రంలోని ఆయిల్ కంపెనీలు, ప్రభుత్వ అధిగారులు ఓ కీలక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది. ఇక నుండి గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసే సమయంలో ఓటిపితో పాటు ఆ సిలిండర్ పైన ఉండే సీరియల్ నెంబర్ ను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఎప్పుడైతే వినియోగదారుడు తన సిలిండర్ అయిపోయిందని బుక్ చేస్తాడో అప్పుడు ఓటిపితో పాటు గతంలో ఆ వినియోగదారుడు ఏ సిలిండర్ నైతే తీసుకున్నాడో అంటే ఆన్‌లైన్‌లో నమోదు చేసిన సీరియల్ నెంబర్ గల సిలిండర్ గ్యాస్ ఏజెన్సీ వారికి అందజేస్తేనే తిరిగి సిలిండర్ ఇవ్వడం జరుగుతుంది...అలా కాకుండా గతంలో మాదిరిగా ఆయా కంపెనీలకు సంబంధించి ఏ ఖాళీ సిలిండర్ ఇచ్చినా తిరిగి నిండు సిలిండర్ ఇచ్చే పరిస్థితి ఉండదు. దీంతో వినియోగదారుడు బ్లాక్ మార్కెట్‌లో తన సిలిండర్‌ను విక్రయించేందుకు సాహసం చేయడు. ఎందుకంటే వినియోగదారుడు నేడు సిలిండర్ బ్లాక్ మార్కెట్‌లో ఇస్తే రూ.2 వేలు సంపాదించుకున్నప్పటికీ తిరిగి అదే సిలిండర్ తన దగ్గరకు రాకపోతే తన ఇంట్లో ఇక కట్టెల పొయ్యి పెట్టుకోవాల్సిన పరిస్థితి రావడం ఖాయం. త్వరలోనే ఈ కీలక ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించాలని ఆయిల్ కంపెనీలు సైతం తొందర చేస్తున్నాయి. తద్వారా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు, డెలివరీ బాయ్స్, ఆయిల్ కంపెనీల పై చెడ్డ పేరు కొంత మేర సమసిపోతుందని వారు భావిస్తున్నట్లు తెలిసింది.


డీలర్ల సలహాలకు ప్రభుత్వం త్వరలో సమావేశం...!

సిలిండర్ లకు సీరియల్ నెంబర్‌లు ఏర్పాటు చేసేందుకు డీలర్ల సలహాలు కూడా తీసుకునేందుకు ప్రభుత్వం భావిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అందుకుగాను నలుగురు లేక ఐదు ఏజెన్సీ ప్రతినిధులను ఇందులో భాగం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఇదే విషయం పై గ్యాస్ ఏజెన్సీలు సైతం సానుకూలత వ్యక్తం చేస్తున్నాయి. ఓటిపి వ్యవస్థ వలన ఇప్పటి వరకూ తమ మీద వినియోగదారుల్లో ఉన్న అపనమ్మకం చాలా వరకు తగ్గిందని, సీరియల్ నెంబర్ వ్యవస్థ కూడా ఆచరణలోకి వస్తే తమ పై పూర్తిగా అపనమ్మకం తొలగుతుందని, అందుచేత ప్రభుత్వం ఈ విషయంలో నిర్ణయం తీసుకున్నట్లయితే ఓటిపి విధానం పై తాము చేసిన కృషికి సమానంగా ఈ సీరియల్ నెంబర్ వ్యవస్థ కూడా ఆచరణ సాధ్యం అయ్యేలా చూస్తామని సదరు గ్యాస్ అసోసియేషన్ పెద్దలకు అసోసియేషన్ సభ్యులు తెలియజేయడం జరిగింది. ఇప్పుడు ఎలాగైతే బుకింగ్, ఓటిపి, డెలివరీలకు సంబంధించిన విధానాలను సాఫ్ట్‌వేర్ రూపంలో అప్డేట్ చేసి పూర్తి పారదర్శకంగా చేశారో, ఈ సిలిండర్ సీరియల్ నెంబర్ విధానాన్ని కూడా సాఫ్ట్‌వేర్‌లోనే అప్డేట్ చేస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రభుత్వానికి సూచించాలని అసోసియేషన్ సభ్యులు అందరూ తెలపడం జరిగింది.

సాధ్యమైనంత త్వరగా ఈ విధానాన్ని అమలు చేయాలని, మొదట్లో మూడు నాలుగు నెలలు కష్టంగా ఉన్నా కూడా క్రమేణ వినియోగదారులు కూడా అలవాటుపడతారని, గ్యాస్ సిలిండర్ డెలివరీ వ్యవస్థ కూడా పూర్తి స్థాయిలో ప్రక్షాళన అవడం ఖాయమని డీలర్లు చెబుతున్నారు. కావున ఈ నిర్ణయం తీసుకోవాల్సిన సరైన సమయం కూడా ఇదేనని ఏజెన్సీల తరపున ప్రభుత్వంకు తెలపాలని అసోసియేషన్ సభ్యులు నిర్ణయానికి వచ్చారు. ఇదే సమయంలో ఆయిల్ కంపెనీలు మాత్రం ఈ విధానాన్ని పూర్తిగా అమలుపరచడానికి మీనమేషాలు లెక్కిస్తుండడం ప్రభుత్వానికి మింగుడు పడనీయడం లేదు. అయితే ప్రభుత్వం డీలర్ల సలహా తీసుకున్న అనంతరం ఆయిల్ కంపెనీల పై ఒత్తిడి పెంచి అయినా సిలిండర్లకు సీరియల్ నెంబర్లను ఏర్పాటు చేసే అవకాశం లేకపోలేదు. మరి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తుందో లేదో వేచి చూడాలి మరి...!

సమస్య పరిష్కారానికి ముందడుగు

వెలుగు దినపత్రిక కథనానికి స్పందన


షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

మా ఆసుపత్రిక వాచ్‌మెన్‌ను ఇవ్వండి సారు!

ప్రభుత్వ ఆసుపత్రిలో పర్మినెంట్ వాచ్ మెన్ కొరత

రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న మహిళా వైద్య సిబ్బంది

జిల్లా వైద్య అధికారులు స్పందించాలని గ్రామస్తులు డిమాండ్

(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఏప్రిల్ 10)

మండలంలోని మేదరమెట్ల గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల నందు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించే దాక్షర్లు ఉన్నప్పటికీ పర్మినెంట్ వాచ్ మెన్ లేకపోవడంతో ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో మహిళా సిబ్బంది నైట్ డ్యూటీ చేయాలంటే బిక్కు బిక్కు మంటూ భయం గుప్పెట్లో డ్యూటీ చేయవలసిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో ఎవరైనా ఆకతాయిలు ఇబ్బంది పెడితే పరిస్థితి ఏమిటి అని వారు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరు అంటూ పలువురు ప్రజలు అందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రజలతో మమేకమై మెరుగైన వైద్యం అందించే దాక్షర్లు, వైద్య సిబ్బంది ఉన్నారని వారికి కావలసిన సౌకర్యాలను చూసుకోవలసిన బాధ్యత జిల్లా వైద్య ఉన్నతాధికారుల మీద ఉందని గ్రామంలోని పలువురు ప్రజలు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వైద్య యంత్రాంగం వెంటనే స్పందించి వైద్యశాలకు పర్మినెంట్ వాచ్ మెన్ ను కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

www.shanmukhavelugu.com
11 Apr 2026 - Page 6

(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఏప్రిల్ 11) మండలంలోని మేదరమెట్ల నందు ప్రభుత్వ వైద్యశాలలో పర్మినెంట్ వాచ్ మెన్ లేక మహిళ వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో షణ్ముఖ వెలుగు దినపత్రికలో "మా ఆసుపత్రికి వాచ్ మెన్‌ను ఇవ్వండి సార్" అనే కథనం ప్రచురితం అయ్యింది. ఈ నేపథ్యంలో ప్రకాశం డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు స్పందించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్‌డిఎస్ ఫండ్స్‌తో వాచ్ మెన్‌ను నియమించుకోవచ్చని, ఈ విషయమై అక్కడ పనిచేసే వైద్యాధికారులకు సరైన గైడ్లైన్స్ ఇస్తానని, సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని ఆయన వెలుగు పత్రిక ప్రతినిధికి తెలియజేశారు. అయితే ఈ సమస్య వీలైనంత త్వరగా పరిష్కారం అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే మహిళ సిబ్బంది బాధలు తీరుతాయని గ్రామస్తులు కోరుతున్నారు. ఇటీవల కాలంలో రాత్రివేళ డ్యూటీ సమయంలో ఆకతాయిలు ఆసుపత్రికి వచ్చి మహిళా సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వాటి పై త్వరగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో వారికి ఏదైనా జరిగితే వైద్య శాఖ దే బాధ్యత అని వారు అంటున్నారు.





20 లక్షల సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటే లక్ష్యంగా అడుగులు

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 11)

రాష్ట్రంలో 20 లక్షల సోలార్ రూప్ టాప్‌ల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మార్కాపురం మండలంలోని పెద్ద యాచవరం గ్రామంలో శనివారం ఆయన జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి లతో కలిసి పీఎం సూర్య ఘర్ సోలార్ రూట్ టాప్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకానికి రూ.1200 కోట్లు ఖర్చు చేస్తున్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా ఉచితంగా వారి ఇంటి పైనే ఏర్పాటు చేసి అక్కడే విద్యుత్ ఉత్పత్తి అయ్యేవిధంగా చర్య తీసుకుంటున్నామన్నారు. దీని ద్వారా వారికి విద్యుత్తు లభించడంతోపాటు భవిష్యత్తులో దాన్ని అమ్ముకునేందుకు వెసులుబాటు కలుగుతుందన్నారు. అదే విధంగా బీసీలు, ఓసీలకు సైతం సబ్సిడీపై ఈ పథకాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. మార్కాపురం జిల్లాలో ఈ పథకం కింద రూ.402 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. అదే విధంగా జిల్లాలో విద్యుత్ అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత మాట్లాడుతూ దేశంలో (తరువాయి 4లో...)

మార్కాపురంలో కన్నుల పండుగగా చెన్నకేశవుని రథోత్సవం

వేలాదిగా తరలివచ్చిన జనం
కొనసాగిన సాంస్కృతిక కార్యక్రమాలు
నాలుగు మాడవీధులలో తరలివచ్చిన భక్తులకు అన్న వితరణ
జై చెన్నకేశవ జై జై చెన్నకేశవ భక్తులు నినాదాలు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 11)

మార్కాపురం పట్టణంలో తిరుమల తిరుపతి తరహాలో శ్రీ దేవి భూదేవి లక్ష్మీ చెన్నకేశవ స్వామి తిరుణాల వైభవంగా జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్కాపురం లోని శ్రీదేవి భూదేవి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్సవాలు ఈ నెల 1తేదీ నుంచి 19 వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్రీదేవి భూదేవి లక్ష్మీ చెన్నకేశవ రథోత్సవం పై పట్టణం లోని నాలుగు మాడవీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచారు. రథోత్సవం వీక్షించేందుకు జనం వేలాదిగా తరలివచ్చారు. ఉత్సవాల కార్యనిర్వాక కార్యదర్శి గోలమర్రి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకుల శ్రీపతి అప్పన్న చార్యులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి రథోత్సవం రాష్ట్ర మంత్రివర్యులు గొట్టిపాట రవికుమార్ జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవంలో విహరిస్తున్న చెన్నకేశవున్ని దర్శించుకోవడానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు. భక్తుల జై చెన్నకేశవ జై జై చెన్నకేశవ నామస్పరణతో మారుమోగిపోయిన (తరువాయి 4లో...)







సామాజిక సమానత్వానికి మార్గదర్శి జ్యోతిబాపూలే

పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే ఏలూరి ఘన నివాళి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం, ఏప్రిల్ 11)

సామాజిక సమానత్వానికి జ్యోతిరావు పూలే మార్గదర్శి అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఏపి మారి టైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్యలు అన్నారు. శనివారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం కోసం తన చివరి శ్వాస వరకు అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావ్ పూలే అన్నారు. నాటి సమాజంలో మూఢనమ్మకాలు, అజ్ఞానం, అణచివేతల మధ్య నలిగిపోయిన బడుగు, బలహీన వర్గాలకు ఆయన కొత్త దారి చూపించారని కొనియాడారు. సమసమాజ నిర్మాణం కోసం అనేక సంస్థలు స్థాపించి, ఎన్నో ఉద్యమాలు నిర్వహించి సమాజంలో గొప్ప మార్పుకు నాంది పలికారని పేర్కొన్నారు. స్త్రీలు అభివృద్ధి చెందకపోతే దేశానికి పురోగతి అసాధ్యం అని నాటి నుంచే గ్రహించి మహిళా విద్యకు తొలి జ్యోతి వెలిగించారన్నారు. తన సతీమణి సావిత్రిబాయి పూలేను విద్యాబోధనలో భాగస్వామిని చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. అనాథ శిశువులకు ఆశ్రయం కల్పించడం, వితంతువుల పునర్వివాహానికి మద్దతు ఇవ్వడం వంటి సంస్కరణల ద్వారా అణగారిన వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచారని తెలిపారు.

"పూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరం కృషి చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ "జ్యోతిరావ్ పూలే చూపిన మార్గం నేటి సమాజానికి దిశానిర్దేశం చేస్తోందన్నారు. సమానత్వం, విద్యా విస్తరణకు ఆయన చేసిన కృషి తరతరాలకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త విక్రమ్ నారాయణ, ఎన్నారై కొల్లా అశోక్, తెలుగుదేశం పార్టీ నాయకులు కాపు రవిచంద్ర, పుల్లెల సుబ్బారావు, కొరిటాల సురేష్, కొమ్మాలపాటి సురేష్, నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషణ పక్వాడ పై అవగాహన





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఏప్రిల్ 11)

పోషణ పక్వాడలో భాగంగా శనివారం కనిగిరి సెక్టార్ లోని పాతకూచిపూడిపల్లి అంగన్వాడీ సెంటర్ నందు గర్భిణీ, బాలింతలు, తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సుమతి మాట్లాడుతూ గర్భవతి అయినప్పటి నుండి బిడ్డకు 2 సంవత్సరాలు నిండే వరకు సమయం ఎంతో అమూల్యమైనదన్నారు. ఈ 1000 రోజుల సంరక్షణ వారి మెదడు అభివృద్ధి పై ప్రభావం చూపుతుందని, వారికీ సరైన ఆహారం, తల్లిపాలు ఇస్తూ జంక్ ఫుడ్ కి దూరంగా ఉంచాలని, టివి, మొబైల్ చూసే సమయాన్ని పూర్తిగా తగ్గించాలని తెలియజేశారు. అంగన్వాడీ సెంటర్‌లో ఇచ్చేటువంటి బాలామృతంలోని పోషకాల గురించి తల్లులకు తెలియపరచి దానిని 6 నెలలు నిండినప్పటి నుండి పిల్లలకు తప్పకుండ పెట్టాలని తెలియజేశారు. జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం సందర్భంగా తల్లి, బిడ్డల సంరక్షణ గురించి తెలియచేసారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు అనురాధ, రహ్మత్ బి, ఆశా వర్కర్ శ్యామల, తల్లులు పాల్గొన్నారు.

మార్కాపురంలో కన్నుల పండుగగా చెన్నకేశవుని రథోత్సవం








పట్టణంలోని నాలుగు మాడవీధులు. ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా పట్టణంలో విద్యుత్ సరఫరా ముందుగా నిలిపివేశారు. నాయుడు బజారు, పాత బస్టాండు, రాజాజీ వీధి, రథం బజారుల్లో ఎలాంటి వాహనాల రాకపోకలు సాగించకుండా చర్యలు తీసుకున్నారు. ఆర్టిసి బస్సులను పాత బస్టాండు వైపు రాకుండా రూటు మార్చారు. ఈ ఉత్సవాల వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటలనకు తావు లేకుండా డివిజన్లోని పోలీస్ అధికారులు, సిబ్బంది 350 మందికి పైగా బందోబస్తు నిర్వహించారు. ఉత్సవం నిర్వహించే ప్రధాన వీధుల్లో ఎలాంటి







అపరిశుభ్రతకు తావులేకుండా మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు పర్యవేక్షణలో మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులు శ్రమించారు. వేకువ జాము నుంచి రాత్రి వరకు జరిగిన రథ సప్తమి వేడుకలు తిరు మల తిరుపతిని తలపించాయి. ఈ రథోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కందుల







నారాయణరెడ్డితో పాటు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్‌రావు, ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, మార్కాపురం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మార్కాపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

20 లక్షల సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటే లక్ష్యంగా అడుగులు







ఈ పథకం కింద కోటి మందికి లబ్ధి చేకూర్చే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వెళుతున్నాయన్నారు. మార్కాపురం జిల్లాలో 12,342 మంది లబ్ధిదారులు ఈ పథకానికి అర్హులుగా చేర్చి వారికి విడతల వారీగా సోలార్ రూఫ్ టాప్ లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలోని ప్రజలు ఈ పథకాన్ని ఉపయోగించుకొని లబ్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ కె వెంకటేశ్వర్లు, ఈ ఈ నాగేశ్వరరావు, డీఈఈ సియా నాయక్, డీఎస్పీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.





సంస్కృత పరిశోధనలో రేవతి సుప్రజకు డాక్టరేట్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 11)

ఒంగోలుకు చెందిన మాచాభక్తుని రేవతి సుప్రజ డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టా సాధించారు. ఆమె తిరుపతిలోని జాతీయ సంస్కృత యూనివర్సిటీ నుంచి ఈ పట్టాను పొందారు. "సంస్కృత-ఆంగ్ల అలంకార శాస్త్రాలలోని సౌందర్య తత్వాల తులనాత్మక అధ్యయనం" అనే అంశంపై ఆచార్య రాణి సదాశివమూర్తి పర్యవేక్షణలో ఆమె తన పరిశోధన పూర్తి చేసినట్లు తెలిపారు. సమర్పించిన పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయం ఆమోదించి డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. కాగా ఈ నెల 10న తిరుపతిలోని సంస్కృత యూనివర్సిటీ వారు మహతి ఆడిటోరియంలో నిర్వహించిన 5వ స్నాతకోత్సవంలో రేవతి సుప్రజ డాక్టరేట్ అందుకున్నారు. రేవతి సుప్రజ స్వస్థలం మార్కాపురం జిల్లాలోని పొదిలి పట్టణం. వివాహం అనంతరం భర్త, ఇద్దరి పిల్లలతో ఒంగోలులో నివాసం ఉంటున్నారు. రేవతి సుప్రజ సాధించిన ఈ విజయం పై కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యం

సిఎస్ఆర్ శర్మ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కరవది రాఘవరావు

ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన శర్మ కళాశాల విద్యార్థులకు ఘన సన్మానం

అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 11)

విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడమే తమ లక్ష్యమని సిఎస్ఆర్ శర్మ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కరవది రాఘవరావు పేర్కొన్నారు. శనివారం శర్మ కళాశాల సెమినార్ హాలులో ఏర్పాటు అయిన విద్యార్థి బృంద వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శర్మ కళాశాలకు పూర్వ వైభవాన్ని సంతరించి పెట్టడంతో పాటు కళాశాల ఆస్తులు పరాధీనం కాకుండా పరిరక్షించేందుకు శర్మ కళాశాల యాజమాన్యం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని స్పష్టం చేసారు. కార్యక్రమానికి శర్మ కళాశాల ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. శర్మ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు డాక్టర్ గంజాం శ్రీనివాస మూర్తి, కోశాధికారి ఓరుగంటి నరసింహశాస్త్రి, పాలక వర్గ సభ్యులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన శర్మ కళాశాల పూర్వ విద్యార్థులు నారాయణం భరద్వాజ సాయి వివేక్, సందం నాగరాజు, బత్తుల సుబ్బారాయుడులను ఘనంగా సన్మానించారు. ఆంగ్ల అధ్యాపకురాలు లక్ష్మీ గాయత్రి పర్యవేక్షణలో విద్యార్థులు కోలాటం నృత్య ప్రదర్శనలతో అలరించారు. వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులను సత్కరించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉపాధ్యాయులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మహిళా బిల్లులో రిజర్వేషన్ కల్పించాలి

అగ్రకుల మహిళల కేనా మహిళా రిజర్వేషన్ ?
మనువాద మోడీ మహిళా రిజర్వేషన్ బిల్లు ను నిరసిస్తున్నాం
ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు మహిళ రిజర్వేషన్‌లో
రిజర్వ్ సీట్లు కేటాయించటమే మహాత్మా పూలేకిచ్చే నిజమైన నివాళి
దళిత నేత నీలం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 11)

పార్లమెంట్లో ప్రవేశపెట్టబోతున్న 33% మహిళా రిజర్వేషన్ బిల్లులో ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని మోడీ ప్రభుత్వాన్ని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్ర డిమాండ్ చేశారు. శనివారం మహాత్మా పూలే 135వ జయంతి సందర్భంగా కొత్త కూరగాయల మార్కెట్ వద్దనున్న మహాత్మ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నీలం నాగేంద్ర మాట్లాడుతూ 1950 అంబేద్కర్ రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటి నుండి 1952 లో పార్లమెంటు ఎన్నికలు జరిగినప్పటి నుండి పురుషులకు పార్లమెంట్ అసెంబ్లీ స్థానాలు కేటాయించారన్నారు. కానీ ప్రత్యేకించి మహిళలకు పార్లమెంట్ అసెంబ్లీ సీట్లు కేటాయించాలని చట్టమే లేదని ఆయా రాజకీయ పార్టీల నిర్ణయం ప్రకారం సిట్టింగ్ ఎంపి ఎమ్మెల్యే చనిపోతే వారి భార్యలకు సీట్లు ఇచ్చే వారన్నారు. కాని జిల్లా పరిషత్ మున్సిపాలిటీ, పంచాయితీ లో ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ తో పాటు మహిళా రిజర్వేషన్ కూడా అమలవుతుందన్నారు. కానీ చట్టసభల్లో మాత్రం రాజకీయ పార్టీల దయాదాక్షణ్యాల మేరకు మహిళల కు సీట్లు కేటాయిస్తుందన్నారు. మహిళలకు ఆస్తి హక్కుతో పాటు పురుషులతో పాటు సమాన హక్కులు ఉండాలని కేంద్ర న్యాయశాఖ మంత్రిగా డాక్టర్ అంబేద్కర్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన హిందూ కోడ్ బిల్లును ఆనాటి కాంగ్రెస్ తో సహా ప్రతిపక్షాలన్నీ వ్యతిరేకించాయ అన్నారు. మహిళా హక్కుల కోసం కేంద్ర న్యాయశాఖ మంత్రి అంబేద్కర్ ఆనాడే రాజీనామా చేశారన్నారు. భారతదేశంలో ముగ్గురు గురువుల లో ఒకరైన మహిళలకు విద్య ను బోధించి, తన భార్య సావిత్రిబాయి పూలే తో కలిసి మహిళా హక్కుల కొరకు పోరాడిన సామాజిక న్యాయ విప్లవ మూర్తి మహాత్మా పూలే అన్నారు. భారతదేశంలో నేడు ఎస్సీ ఎస్టీ బీసీలకు సబ్సిడీ రుణాలు కూడా ఇవ్వకుండా పరిశ్రమలను ఆదాని అంబానీ లాంటి వారికి తాకట్టు పెడుతున్న మోడీ కూడా ఈరోజు మహాత్మా పూలే జయంతి సందర్భంగా నివాళి అర్పించడం మేలి ముసుకు మనువాదం అన్నారు. ఎస్సీ ఎస్టీల ప్రత్యేక నియోజకవర్గాల ఏర్పాటును ఆనాడు గాంధీ ఆమరణ నిరాహార దీక్ష చేసి రద్దు చేయించారన్నారు. మరలా ఈనాడు గాంధీ ఆలోచనలతో గుజరాత్ మోడీ మహిళా రిజర్వేషన్ బిల్లులో ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్ కోటా లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టటం ఎస్సీ ఎస్టీ బీసీ మహిళల రాజకీయ హక్కును హరించటమేనన్నారు. ఎటువంటి కమిషన్ లేకుండా అగ్రకులాల ఆందోళనలు లేకుండానే ఆర్థికంగా వెనకబడిన వారంటూ ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ పేరుతో 10 శాతం రిజర్వేషన్లు ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో మోడీ ప్రభుత్వం కేటాయించిందన్నారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించ కూడదని, సుప్రీంకోర్టు చెప్పిందని ఒకవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ పెంచకుండా దగా చేస్తున్న మోడీ ప్రభుత్వం అగ్రకులాలకు మాత్రం ఏక పక్షంగా 10 శాతం రిజర్వేషన్లు ఫలహారంగా ఇచ్చిందన్నారు. అనేక సంవత్సరాలుగా అమలుకు నోచుకోని మహిళా రిజర్వేషన్ బిల్లు లో ఎస్సీ ఎస్టీ బీసీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించకుండా మోడీ ప్రవేశపెడుతున్న మనువాద అగ్రకుల మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్లో తెలుగుదేశం, వైసిపి వ్యతిరేకించాలన్నారు. ప్రతిపక్షల సూచనలు పాటించకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు సబ్ కోటా లేకుండా అగ్రకుల మహిళలను అందలం ఎక్కిస్తూ మోడీ మహిళా బిల్లును ఎస్సీ, ఎస్టీ, బీసీ రాజకీయ ప్రతినిధులు వ్యతిరేకించాలన్నారు. రిజర్వేషన్లలో అన్ని కులాల వారికి సమన్యాయం జరగాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేసిన సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్ లేకుండా మోడీ ప్రవేశపెడుతున్న అగ్రకుల మహిళా రిజర్వేషన్ బిల్లును రద్దు చేయాలని దళిత నేత నేల నాగేంద్ర డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, మేడికొండ మురళి, గొర్రె ముచ్చు కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమాన హక్కులు, సమగ్ర అభివృద్ధి పూలే ఆశయాలను నిజం చేస్తున్న కూటమి ప్రభుత్వం

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్‌రావు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 11)

అణగారిన వర్గాల ఆశాజ్యోతి, మహానీయుడు జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని నగరంలోని కొత్త మార్కెట్ నందు వారి విగ్రహానికి తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్‌రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ పూలే సమాజంలో ఉన్న కుల వివక్షను ఎదుర్కొని, మహిళల విద్యకు పునాది వేసిన గొప్ప సంస్కర్త అని కొనియాడారు. సమాన హక్కులు అందరికీ అందాలని జీవితాంతం పోరాడిన హోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. అలాంటి మహానుభావుల ఆశయాలను కొనసాగిస్తూ, మాన్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళల సాధికారతతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సమాన సమాజ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధాని మోడీతో సంభిషించే అవకాశం దక్కించుకున్న క్విస్ కళాశాల విద్యార్థిని శివకుమారి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 11)

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఈసీఈ మొదటి సంవత్సరం విద్యార్థిని శివకుమారి దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తో వర్చువల్ మాధ్యమంలో సంభాషించే అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. మై భారత్, ప్రకాశం సహకారంతో నిర్వహిస్తున్న యువత సాధికారత కార్యక్రమంలో భాగంగా ఆమె ఎంపికైంది. ఈ కార్యక్రమం గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 12, 13 తేదీలలో జరగనుంది. దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో ఆర్థిక అవగాహన పెంపొందించేందుకు, యువతను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం డాక్టర్ సూర్య కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ ఎన్ శ్రీ గాయత్రి దేవి, అకాడెమిక్ డీన్ డాక్టర్ సత్య మెహర్, ఫస్ట్ ఇయర్ హెచ్ఓడీ డాక్టర్ గంటా శ్రీనివాసరావు శివకుమారిని అభినందించారు. ఆమె సాధించిన ఈ విజయం పై వారు ఆనందం వ్యక్తం చేసారు.

రామచంద్ర యాదవ్ దీక్షకు మద్ధతుగా ఒంగోలులో మిరియం నిరవధిక నిరాహారదీక్ష

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 11)

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడుతున్న బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ తలపెట్టిన ఆమరణ నిరాహార దీక్ష కార్యక్రమానికి మద్దతుగా 139 కులాల జేఏసీ చైర్మన్ మిరియం శ్రీనివాసులు శనివారం ఒంగోలులోని విద్యుత్ భవన్ వద్ద ఉన్న కాటంరాజు విగ్రహం ఎదుట నిరవధిక నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ న్యాయవాది అజీజ్ మిరియం శ్రీనివాసులకు పూలమాలవేసి దీక్షను ప్రారంభింపజేశారు. ఈ కార్యక్రమంలో మిరియం శ్రీనివాసులు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి దశాబ్దాల కాలం దాటినప్పటికీ బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో ఇప్పటికీ వెలుగులు లేవని, చిమ్మ చీకట్లే అలుముకొని ఉన్నాయన్నారు. రాజకీయ నాయకులు కేవలం బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఓట్ల కోసమే చూస్తున్నారు తప్ప వారి అభ్యున్నతికి ఎక్కడా కూడా తోడ్పాటు ఏ పార్టీలు అందించడం లేదన్నారు. చాలీచాలని రిజర్వేషన్లతో బలహీనవర్గాల విద్యార్థులు ఉద్యోగాలు లేక ఉపాధి కోల్పోతున్నారన్నారు. ఇవన్నీ చూసి చలించిపోయిన రామచంద్ర యాదవ్ తన జాతి అభివృద్ధి కోసం చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు తాను మద్దతు తెలుపుతున్నట్లుగా తెలియజేశారు. అదే విధంగా రామచంద్ర యాదవ్ చెప్పిన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకపోతే రానున్న రోజుల్లో బీసీలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. అధికారంలోకి రాకముందు చెప్పిన విధంగా బీసీ రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని, అదే విధంగా రాజధాని ప్రాంతంలో బీసీలకు వెయ్యి ఎకరాల భూమిని బీసీలకు కేటాయించాలన్నారు. స్థానిక సంస్థల ఉద్యోగాల్లో 44 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, బిసి కార్పొరేషన్లకు నిధులు కేటాయించి శాశ్వత భవనాలు నిర్మించాలన్నారు. బిసి కుల గణన చేపట్టి ప్రభుత్వం తన చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. లేదంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హేతువాద సంఘ నాయకులు బేగుసల్ల హరి, కొమ్మనబోయిన నాగేశ్వరరావు, దూల్లా అప్పారావు, ఆవుల మహేష్, సవరం వెంకటేశ్వర్లు, మల్లవరపు శ్రీనివాసులు, నక్క రమేష్, చల్లా హరిప్రసాద్, పోడమేకల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.





జ్యోతిబాపూలే జయంతి వేడుకలో ఎమ్మెల్యే ముత్తుముల



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఏప్రిల్ 11)

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జ్యోతిబాపూలే 199వ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా జ్యోతీబాపూలే (1827-1890) మహారాష్ట్రకు చెందిన ప్రముఖ భారతీయ సామాజిక సంస్కర్త, విద్యావేత్త, కుల వ్యతిరేక ఉద్యమకారుడన్నారు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు, అలాగే మహిళలు, అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారు. తన భార్య సావిత్రిబాయి ఫులేతో కలిసి 1848లో పూణేలో బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించారన్నాకుల వివక్షకు వ్యతిరేకంగా, సమానత్వం కోసం పోరాడారు. స్త్రీ విద్య, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం 1873లో 'సత్యశోధక్ సమాజ్' (సత్య శోధకుల సమాజం)ను స్థాపించారని తెలిపారు. సామాజిక సేవలకు గుర్తింపుగా 1888లో ఆయనకు 'మహాత్మా' అనే బిరుదు లభించిందన్నారు. జ్యోతిబాపూలే 28 నవంబర్ 1890లో మరణించారని తెలిపారు. ఈ జయంతి వేడుకలో నియోజకవర్గ, మండల పార్టీ అధ్యక్షులు, పట్టణ కౌన్సిలర్‌లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకలు

పూలే జీవితం నేటి తరానికి ఆదర్శనీయం
షేక్ సైదా, చుండూరి రంగారావు






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 11)

మహాత్మ జ్యోతిబాపూలే జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా, ఆల్ ఇండియా సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా అధ్యక్షులు చుండూరు రంగారావు అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన గొప్ప సంస్కర్త అని, మహిళల విద్య కోసం, వారి సమానత్వం కోసం, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం, అవినీతి అంతరాల నిర్మూలన కోసం ఆయన మహోన్నతమైన ఉద్యమం నడిపారన్నారు. అనంతరం ఆయన జయంతిని పురస్కరించుకొని కేక్ కట్ చేసి అందరికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ సుబ్బారావు, ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ మనం ప్రసన్నరాజు, మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ షేక్ మహబూబ్ హోలీ, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొండ్రగుంట సుబ్బారావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ రసూల్ గోరంట్ల కోటేశ్వరరావు, కాకర్లపూడి వేణు రాజు,రాష్ట్ర మైనార్టీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ సయ్యద్ రఫీ, రైతు నాయకులు శ్రీనివాసరాజు, గోపాల్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, చెన్నారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జాకబ్, యువజన నాయకులు వెంకటేష్, జిల్లా బీసీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com

పారిశుధ్యం, తాగునీటి పథకాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు









(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 11)

పారిశుధ్యం, త్రాగునీటి పథకాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించేందుకు మరింత దృష్టి పెట్టినట్లు చెప్పారు. ' పల్లెనిద్ర ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి దర్శి మండలంలోని పోతవరం గ్రామంలో నిద్రించిన కలెక్టర్, శనివారం వేకువ జామునే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీటిని సరఫరా చేస్తున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి ఈ సేవలతోపాటు స్థానిక సమస్యలపై ఆరా తీశారు. వారి నుంచి అర్జీలను స్వీకరించాలి. స్కూలుకు వెళ్తున్న విద్యార్థులతో మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఇందుకోసమే ప్రభుత్వం ' ముస్తాబు ' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. గోళ్లు పెంచుకోవద్దని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయడంతో పాటు వర్మీ కంపోస్టును తయారు చేస్తున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉపాధి హామీ చట్టం కింద చేపట్టిన పనులను తనిఖీ చేశారు. పని ప్రదేశంలో కూలీలకు కల్పిస్తున్న సదుపాయాలను, వారితో ముఖాముఖి మాట్లాడి వేయిస్తున్న విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు.



తానంచింతల ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రాంగణంలో విద్యార్థులకు ప్రమాదకరంగా ఎలాంటి స్తంభాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలోని చేతి పంపును బాగు చేయించాలని అధికారులకు స్పష్టం చేశారు. తానంచింతల గ్రామానికి మంచినీటిని సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకును కలెక్టర్ పరిశీలించారు. ట్యాంక్ నిర్వహణ నిబంధనల మేరకు ఉండాలని, నిర్దిష్ట సమయానికి శుభ్రం చేయించాలని అధికారులకు చెప్పారు. అనంతరం దర్శిలోని ఎన్ఏపి మంచినీటి పథకాన్ని కలెక్టర్ సందర్శించారు. ఎంతో కీలకమైన ఈ పథకం నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. నీటి శుద్ధీకరణలో ప్రభుత్వ నిర్దేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. స్టోరేజీ ట్యాంకు, ఫిల్టర్ కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బంది విధులపై ఆరా తీశారు. సిబ్బంది అందరూ పూర్తిస్థాయిలో విధులకు హాజరు కావాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించబోనని హెచ్చరించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జడ్పీ సీఈవో చిరంజీవి, డ్వామా పి.డి జోసఫ్ కుమార్, డిపిఓ వెంకటేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఏపీసిపిడిసిఎల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

నాగరాజు కుటుంబానికి ఆత్మీయ ప్యాకేజీ అందజేత



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 11)

ఇటీవల పొదిలిలో విద్యుత్ షాక్ తో మరణించిన బూచిరాజు నాగరాజు కుటుంబ సభ్యులకు మానవతలోని దాతలు ఆవుల కృష్ణారెడ్డి, ఆవుల సంజీవరెడ్డి లు అందించే రూ.5000ల ఆత్మీయ ప్యాకేజిని శనివారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు కాకునూరి యలమందారెడ్డి, కార్యదర్శి బండి అశోక్, కోశాధికారి సోమిశెట్టి చిరంజీవి, జాయింట్ సెక్రెటరీ భూమా సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 11)

మండల పరిధిలోని ఆత్మకూరు ఆది ఆంధ్ర కాలనీ నందు శనివారం కరేడు వైద్యాధికారిణి శ్రీజారెడ్డి వడదెబ్బ లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా వేసవి కాలంలో నీరు, పళ్ళ రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, కాటన్ దుస్తులు ధరించాలని, రోజుకు కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలని, ఎండ వేళల్లో ఇంటి వద్దనే ఉండాలన్నారు. బయటికి వెళ్లాల్సి వస్తే ఖచ్చితంగా గొడుగు లేదా టోపీని తీసుకుని వెళ్లాలన్నారు. ఎక్కువ సమయం నీడ ఉన్న ప్రదేశంలో ఉండాలని, అలాగే ఎక్కువ వేసవి తీవ్ర ఉష్ణోగ్రత ఉన్న సమయంలో బయట తిరగవద్దని, బయట రంగు పానీయాలు తాగవద్దని, నలుపు రంగు దుస్తులు, మందపాటి దుస్తులు ధరించరాదన్నారు. వడదెబ్బ లక్షణాలు చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం ఇటువంటి లక్షణాలు ఉన్న వెంటనే వారిని చల్లటి ప్రదేశంలో ఉంచి తడి గుడ్డతో శరీరమంతా తుడిచి ఓఆర్ఎస్ ద్రావణాన్ని త్రాగించి సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేర్చాలని వైద్యాధికారిణి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి కృషియా బేగం, ఏఎన్ఎం మాలతి, అల్తాఫ్, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి మహాత్మా జ్యోతిబాపూలే కృషి

పూలే ఆశయాలు, కార్యాచరణ నేటికీ స్ఫూర్తిదాయకం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 11)

అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యాభివృద్ధికి మహాత్మా జ్యోతిబాపూలే కృషి చేశారని, పూలే ఆశయాలు, కార్యాచరణ నేటికీ స్ఫూర్తిదాయకమని టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గోగినేని రామారావు అన్నారు. శనివారం ఒంగోలు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళా విద్య, దళిత, బడుగు వర్గాల హక్కులకు, కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే అని తెలిపారు. సామాజిక ఉద్యమాలు నడిపి నిస్వార్థంగా సామాజిక వికాసానికి విలువలు నేర్పుతూ మార్గదర్శిగా నిలిచారన్నారు. సమసమాజ నిర్మాణంలో జ్యోతిరావు పూలే కీలక పాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. పూలే ఆశయ సాధనకు కృషి చేయడమే మనం అర్పించే ఘన నివాళి అని టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి బొడ్డపాటి వెంకట్, టిడిపి సీనియర్ నాయకులు ఎద్దు శశికాంత్ భూషణ్, టిడిపి సీనియర్ నాయకులు పాలపర్తి లక్ష్మీనారాయణ, 15 డివిజన్ అధ్యక్షులు గడ్డం ఆదినారాయణ, కసుకుర్తి అంకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఏరియా మహాసభను జయప్రదం చేయండి



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఏప్రిల్ 11)

ఈ నెల 17న జరిగే ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ మహాసభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి పి. వి రమణ అన్నారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల పట్ల పెద్ద ఎత్తున వివక్ష చూపుతూ కార్మికులకు హక్కుగా ఉన్నటువంటి చట్టాలను రద్దుచేసి రాబోయేటువంటి ప్రభుత్వాలకు బానిసలుగా కార్మికులను కార్మిక కుటుంబాలను రోడ్డుకు లాగే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా వారు కష్టపడి సంపాదించుకున్నటువంటి చట్టాలను రద్దు చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్రంలోని డబల్ ఇంజన్ సర్కార్ సైతం గుడ్డిగా అనుసరిస్తుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్రంలో దశాబ్ద కాలంగా కనీస వేతనాల సవరణ జరగలేదు, ఎన్నికలలో కార్మికులు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అట్టెక్కించారన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్రానికి గత ప్రభుత్వం ఇప్పుడు ఉన్నటువంటి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. విదేశీ పర్యటనలు చేస్తూ ఎంఓయులు చేస్తున్నారు తప్ప క్షేత్రస్థాయిలో ఎటువంటి అభివృద్ధి లేదన్నారు. పారిశ్రామిక అభివృద్ధి మందగమనాన్ని కార్మికుల పైకి నెట్టివేస్తుందన్నారు. పని గంటల పెంపుదలకు జీవోలను విడుదల చేసి వెట్టిచాకిరికి ప్రోత్సహిస్తుందన్నారు. స్కీం కార్మికుల వేతనాలు బిల్లుల చెల్లింపు విషయాలలో నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఏఐటీయూసీ నిరంతరం కార్మికుల పక్షాన నిలిచి పోరాడుతుందన్నారు. రాష్ట్రంలో ఐక్యకార్మికోద్యమ నిర్మాణానికి ఐక్య పోరాటానికి ముందు పీఠిన నిలిచి ఉందని ఆయన అన్నారు. దేశ, విదేశాల ప్రైవేటు పెట్టుబడిదారుల కోసం మన అడుగులను భూమిని నీటిని ఆకాశాన్ని సమస్త పకృతి వనరులను కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యవహరించే తీరును ఆయన తప్పు పట్టారు భారతదేశం అంటే అంబానీ ఆదాని అనే విధంగా ఆలోచన చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, నాగేష్, ఏఐటీయూసీ గోపవరం మండల అధ్యక్ష, కార్యదర్శులు గురయ్యా, ఓబులేసు, లారీ యూనియన్ నాయకులు రవీంద్ర, కృష్ణ, రవి, వెంకటేశు , మల్లి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ద్వారా ప్రజలకు ఉచిత మినరల్ వాటర్ వితరణ

సానపురెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో ఉచిత మంచినీరు



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఏప్రిల్ 11)

బద్వేల్ పట్టణ పరిధి బోవిళ్ల వారిపల్లెలో సానపురెడ్డి వెంకట రాధాకృష్ణారెడ్డి, రామగోపాల్ రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, శివ గోపాల్ రెడ్డి, రామచంద్రారెడ్డి, మురళీ మనోహర్‌రెడ్డి, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పదివేలు లీటర్స్ ఆర్వో ప్లాంటును శనివారం సానపురెడ్డి మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ప్రస్తుతం వాటర్ క్యాన్ కొనాలంటే రూ.10 అవుతున్న నేపథ్యంలో బోవిల్లవారిపల్లె గ్రామంలో ప్రతి ఒక్కరికి ఉచిత ఆర్వో ప్లాంట్ ద్వారా మంచినీటిన అందించాలని ఉద్దేశంతో సానపరెడ్డి రాధాకృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్వో ప్లాంటును ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంతంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సానపురెడ్డి వెంకట రాధాకృష్ణారెడ్డి, మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్వో ప్లాంట్ ద్వారా నీటిలోని హానికర రసాయనాలు, భార లోహాలు, సూక్ష్మక్రిములు తొలగిపోవడమే కాకుండా, కఠిన జలం మృదువుగా మారి ప్రజలకు సురక్షితమైన, రుచికరమైన తాగునీరు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలకు విద్యను అందించేందుకు జ్యోతిబాపూలే చేసిన కృషి మరువలేనిది

ఏపీ టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 11)

బడుగు బలహీన వర్గాలకు, ముఖ్యంగా మహిళలకు విద్యను అందించడానికి మహాత్మా జ్యోతిబాపూలే చేసిన కృషి మరువలేనిదని ఏపీ టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికిం విచ్చేసిన ఏపీ టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ డా నూకసాని బాలాజీ మాట్లాడుతూ, 200 సంవత్సరాల గడుస్తున్న కూడా మహాత్మా జ్యోతిబాపూలే మనం గౌరవిస్తున్నామంటే ఆ రోజు ఉన్న దారుణ పరిస్థితులలో కూడా బడుగు బలహీన వర్గాలకు విద్యను అందించడానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. మహిళలకి విద్యను అందించడం, తన సతీమణి ని కూడా విద్యావంతురాలిగా చేసి 1848 లోనే దేశంలో మొదటి పాఠశాలను స్థాపించారని గుర్తు చేశారు. ఆయనకుఎన్ని ఆటంకాలు ఎదురైన కూడా బెదరకుండా ఆయన చేసిన సంస్కరణల వల్ల ఈరోజు ఆర్థికంగా, సామాజికంగా, విద్య, ఉద్యోగ పరంగా మనం ముందున్నామని ఆయన అన్నారు. వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బి చిన ఓబులేసు మాట్లాడుతూ మహాత్మా జ్యోతి బా పూలే గారిని బీసీ వర్గానికి చేసిన వారిగానే చూడకూడదని ఆయన జాతి బిడ్డగా గుర్తించాలన్నారు. వితంతువులు, శూద్రులు, మహిళల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి మరువకూడదనీ అన్నారు. ఆయన జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకమనీ ఆన్నారు. జయంతి , వర్ధంతి కార్యక్రమాల్లోనే కాకుండా నిరంతరం ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిశెట్టి రమాదేవి, డిపిఓ వెంకటేశ్వరరావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి నిర్మలా జ్యోతి, వివిధ బిసి సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి

వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళి కృష్ణ యాదవ్



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 11)
అణగారిన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు వినుకొండలో శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక న్యాయవాది నంబుల రాంబాబు యాదవ్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళి కృష్ణ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీసాల మురళి కృష్ణ యాదవ్ ప్రసంగిస్తూ.. కుల వివక్ష, అంటరానితనం వంటి సామాజిక జాడ్యాలపై పూలే సాగించిన పోరాటం అద్వితీయమని కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ వంటి మహనీయులకు సైతం పూలే ఆదర్శమని గుర్తు చేశారు. ముఖ్యంగా సావిత్రిబాయి పూలే చేసిన సేవలను ఆయన ప్రత్యేకంగా వివరించారు. చదువు నిషిద్ధమైన రోజుల్లోనే భర్త సహకారంతో విద్యనభ్యసించి, దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి చరిత్ర సృష్టించారని కొనియాడారు. సమాజం ఎన్ని అవమానాలకు గురిచేసినా భరించుకుంటూ మహిళల కోసం పాఠశాలలు స్థాపించి, అక్షర వెలుగులు నింపిన ఆమె త్యాగం వెలకట్టలేనిదన్నారు. అలాగే అంటరానితనం నిర్మూలనలో భాగంగా తన ఇంట్లోని మంచి నీటి బావిని దళితుల కోసం తెరిచి ఉంచి పూలే దంపతులు విప్లవాత్మక మార్పుకు నాంది పలికారని గుర్తు చేశారు. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని నమ్మిన వారి అడుగుజాడల్లో నేటి యువత నడవాలని, ఆ మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమసమాజ స్థాపనకు కృషి చేయాలని మురళి కృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి పార్టీ నేషనల్ కోఆర్డినేటర్ నేరెళ్లరాజు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మోతడక వీరాచారి, ఆంధ్ర ప్రదేశ్ దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ లాయర్ సిద్దయ్య, ఆంధ్రప్రదేశ్ యాదవ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ బత్తుల గోవిందరాజులు, జీవనజ్యోతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు కళాకారులు మంద వెంకట్రావు, ప్రముఖ కవి కరిముల్లా, లాయర్ నంబుల రాంబాబు, బిఎస్ఎన్ఎల్ కొండలు, బత్తుల సుబ్బారావు, వినుకొండ నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షులు ఒంటెల శ్రీనివాస్ యాదవ్, వినుకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు ఈ పెనగండ్ల ఏగేశ్వరరావు, గుర్రప్ప నాయుడుపాలెం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి రవి, పమిడిపాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఈ అన్నా బత్తిని నాగరాజు యాదవ్, మాజీ వినుకొండ నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు టైలర్ ఆచారి, నూజెండ్ల మండల బిజెపి పార్టీ అధ్యక్షులు అద్దంకి సుధాకర్, పలువురు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు పాల్గొని పూలే దంపతుల సేవలను స్మరించుకున్నారు.

నూతన వరుడుని ఆశీర్వదించిన మాజీ మంత్రి మానుగుంట





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 11)
మండలంలోని కొల్లూరుపాడు గ్రామంలో శనివారం కోటు రామకోటయ్య, రాజేశ్వరమ్మల కుమారుడు కోటు శివశంకర్ వివాహ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి హాజరై నూతన వరుడుని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మానుగుంట అభిమానులు పాల్గొన్నారు.

నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌ని కలిసిన జిల్లా ఎంపీటీసీ సంఘం అధ్యక్షులు ఆకుపాటి



(షణ్ముఖ వెలుగు, పామూరు, ఏప్రిల్ 11)
పామూరు పట్టణం నందు ఇటీవల జరిగిన సాధారణ బదిలీలో భాగంగా నూతనంగా విధులకు హాజరైనటువంటి సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్‌ను శనివారం ఆకుపాటి వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఐకి పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోటి, నీరుకట్టు నాయిబ్ రసూల్, గుత్తి మహేష్, గద్దె సుధాకర్, ఇండ్ల నరసింహ, కోటయ్య, చాంద్ భాషా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్‌కు అర్హత పొందిన చెస్ క్రీడాకారులు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 11)
స్థానిక మార్కాపురంలోని రేస్ ఇనస్టిట్యూట్‌లో ఈ నెల 9న జరిగిన జిల్లాస్థాయి టీమ్ ఉమెన్ చెస్ చాంపియన్షిప్ 2026 టోర్నమెంట్లో వరుసగా ఎస్ అమరేశ్వరి, పి లతికప్రియ, ఎస్ శ్రీ దీపికరెడ్డిలు మొదటి మూడు స్థానాలలో నిలిచారు. వీరు మే నెలలో బాపట్లలో జరిగే ఎపి టీమ్ సీనియర్ ఉమెన్ చెస్ చాంపియన్షిప్ 2026కు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారని, ఈ చెస్ చాంపియన్షిప్ టోర్నమెంట్‌కు ఆర్బిటర్‌గా షేక్ అబ్దుల్ వచీ వ్యవహరించారని మార్కాపురం జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ అయిన టి వీరా, ప్రెసిడెంట్ ఆర్ ఆదిలక్ష్మి తెలియజేశారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ దేవకుమార్



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఏప్రిల్ 11)
యర్రగొండపాలెం ఎస్ఐ దేవకుమార్ శనివారం మధ్యాహ్నం సమయంలో మార్కాపురంకి రోడ్డు వైపు వెళ్తున్న క్రమంలో కొత్తపల్లి సమీపంలోని 565 జాతీయ రహదారి పక్కనే ఒక బైక్ మీద ఆగి ఉన్న వ్యక్తిని వెనక నుంచి ఇంకొక బైకు వ్యక్తి ఢీకొట్టింది. దీంతో ముందు బైక్ మీద ఉన్న వ్యక్తి స్పృహ కోల్పోయారు. అదే మార్గంలో వెళ్తున్న ఎస్ఐ వెంటనే స్పందించి హుటాహుటిన స్పృహ కోల్పోయిన వ్యక్తిని పోలీస్ వాహనంలోనే ఆసుపత్రికి తరలించారు.ఎస్ఐ దేవకుమార్ మాట్లాడుతూ అతను ప్రస్తుతం క్షేమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తి పై బాధ్యతగా వ్యవహరించిన ఎస్ఐ దేవకుమార్‌ను ప్రజలు అభినందించారు.

మలబార్ గోల్డ్ షోరూంలో తాన్విక 2.0 కొత్త కలెక్షన్ ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 11)
ఒంగోలు లోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఒంగోలు షోరూమ్‌లో శనివారం తాన్విక 2.0 కొత్త కలెక్షన్‌ను ప్రారంభించారు. ఈ కలెక్షన్స్‌లో టెంపుల్ జ్యువలరీ, డివైన్ కలెక్షన్స్ ప్రత్యేకంగా అందుబాటులో ఉన్నాయి. ఈ కలెక్షన్‌ను తాము గత సంవత్సరం కూడా ప్రారంభించగా మా కస్టమర్ల నుండి చాలా మంచి స్పందన వచ్చింది. ఆ విజయాన్ని దృష్టిలో పెట్టుకొని, ఇప్పుడు మరింత అద్భుతమైన డిజైన్స్‌తో తన్విక 2.0గా మళ్లీ లాంచ్ చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. అలాగే అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. గోల్డ్ (అన్ కట్, ప్రిసియా, వివి, పెయింట్) పై అప్ టు 30 శాతం వరకు ఆఫర్ కలదన్నారు. అదే విధంగా డైమండ్స్ వాల్యూ పై కూడా అప్ టు 30 శాతం వరకు ఆఫర్ ఉందన్నారు. ఈ ఆఫర్లు ఏప్రిల్ 8 నుంచి ఏప్రిల్ 20 వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు. మా కస్టమర్లు ఈ అద్భుతమైన కలెక్షన్స్‌ను చూసి ఆనందించడానికి మీ అందరినీ మా షోరూమ్‌కి ఆహ్వానిస్తున్నామని వారు తెలిపారు.

అంగన్వాడీల్లో చిన్నారులకు ముస్తాబు కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 11)
స్థానిక ఎస్ ఎస్వీజీపాలెం అంగన్వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు ముస్తాబు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు తలదువ్వి, పౌడరు అద్ది అందంగా తీర్చిదిద్ది పిల్లల్లో ఆనందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కల్పించారు. ప్రాథమిక దశలోనే ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై చిన్నారులకు అవగాహన కల్పించేందుకు ఈ తరహా కార్యక్రమాలను నిర్వహిస్తుంటామని అంగన్వాడి టీచర్ ప్రశాంతి తెలిపారు.

జగన్నాధపురం ప్రాథమిక పాఠశాలలో జ్యోతిబాపూలే జయంతి వేడుకలు



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఏప్రిల్ 11)
మండలంలోని జగన్నాధపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మహాత్మ జ్యోతిబాపూలే 199వ జన్మదిన వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ జగన్ బాబు ఘనంగా నిర్వహించారు. ఆయన జయంతి సందర్భంగా ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జగన్‌బాబు మాట్లాడుతూ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసేవకుడు జ్యోతిబాపూలే అన్నారు. సమాజంలో సగ భాగంగా ఉన్న స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందదని పూలే భావించాడు. అందువల్ల స్త్రీలు విద్యావంతులు కావాలని నమ్మాడు. ఇతరులకు ఆదర్శంగా ఉండాలని ముందుగా తన భార్య సావిత్రిని పాఠశాలకు పంపాడు. 1848 ఆగస్టులో బాలికలకు పాఠశాల స్థాపించాడన్నారు. ఈ పాఠశాలలో అన్నికులాలకు ప్రవేశం కల్పించడం, అంటరాని వారికి కూడా బోధించవలసి రావడంతో ఉపాధ్యాయులు ఎవరు ముందుకు రాలేదు. చివరకు జ్యోతిబాపూలే తన భార్య సావిత్రి సహాయంతో పిల్లలకు పాఠాలు బోధించేలా చేశాడు. క్రమంగా ఆదరణ పెరగడంతో 1851-52లో మరో రెండు పాఠశాలలు స్థాపించారన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం ప్రాథమిక విద్యను నిర్లక్ష్యం చేయడాన్ని పూలే విమర్శించేవాడు. అనాడు సమాజంలో బాల్య వివాహాలు సర్వసాధారణంగా జరిగేవి. ముసలివాళ్ళకి ఇచ్చి పెళ్లి చేయడం వల్ల చిన్నతనంలోనే మహిళలు వితంతువులయ్యేవారు. వీరు మళ్ళీ వివాహం చేసుకోవడానికి సమాజం అంగీకరించేది కాదు. అందువల్ల వితంతు పునర్వివాహాలు గురించి పూలే ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చాడు. స్వయంగా వితంతువులకు వివాహాలు జరిపించేవాడు. ఈ విధంగా పాఠశాలలోని విద్యార్థులకు ఆయన త్యాగాల గురించి, ఆయన చేసిన సేవల గురించి తెలియజేసి మీరు కూడా సమాజానికి ఎంతో కొంత అభివృద్ధికి కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఎం అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా ముగిసిన చైత్ర మాసం పూజా కార్యక్రమాలు



(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఏప్రిల్ 11)
మండలంలోని వల్లేరవారి పల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో చైత్ర మాసం పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. చైత్ర మాసం నాల్గవ, చివరి శనివారం సందర్భంగా అభిషేకం, ప్రత్యేక పూజలు, రాహుకాల హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారిని పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించగా, భక్తులకు అద్భుత దర్శనం కలిగింది. ఆలయ నిర్వహకులు మాట్లాడుతూ చైత్ర మాసం అంతటా స్వామివారికి వివిధ విశేష పూజలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇక రాబోయే కార్యక్రమాల వివరాలు వెల్లడిస్తూ, ఈ నెల 29వ తేదీ నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. 29, 30 తేదీల్లో పూజలు, హోమాలు నిర్వహించబడతాయన్నారు .మే 1న స్వామివారి తిరుకళ్యాణ మహోత్సవం, చాందినీ బండ్ల ఉత్సవం, గ్రామోత్సవం జరుగుతాయి. మే 2న పులంగి సేవ, బండ్ల ఎద్దుల పోటీలు, మే 3న గ్రామంలో స్వామివారి చలవ పంపకం కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు సకుటుంబ సమేతంగా హాజరై స్వామివారి పూజలు, తిరుకళ్యాణాన్ని తిలకించి, తాంబూలం మరియు ఆశీర్వాదాలు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.
ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించడంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మడకరవారి పల్లె గ్రామానికి చెందిన దబ్బుగుడ్ల అయ్యవారయ్య దంపతులు అన్నదానాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో పలువురు ప్రముఖులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీగిరిలో భక్తిశ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం శాస్త్రోక్తంగా శ్రవణా నక్షత్ర పూజలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 11)

శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా వైభవంగా నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం అర్చకులు, వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. నాద నీరాజనం, చతుర్వేద పారాయణ, విష్ణు సహస్ర నామ పారాయణతో పాటు భారత భాగవత భగవద్గీత రామాయణ శ్లోకాలను పద్యాలను గానం చేసారు. గాయని ఫణిదీప్తి అన్నమయ్య సంకీర్తనలను మృదు మధురంగా ఆలపించి భక్తులను అలరించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులు పర్యవేక్షించారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందచేశారు. ప్రతి ఆదివారం శ్రీగిరి దేవస్థానం గో క్షేత్ర భవన్‌లో చిన్మయ మిషన్ తోడ్పాటుతో నిర్వహిస్తున్న శ్రీగిరి బాలవిహార్ శిక్షణా తరగతులలో పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కోరారు.

మహాత్మ జ్యోతిబాపూలే సేవలు మరువలేనివి అర్బన్ ఎస్ఐ నాగ చిరంజీవి



(షణ్ముఖ వెలుగు, బద్వేలు, ఏప్రిల్ 11)

నేటి యువత ప్రతి ఒక్కరు మహాత్మ జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలని బద్వేల్ అర్బన్ ఎస్ఐ నాగ చిరంజీవి అన్నారు. శనివారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా సిద్ధవటం రోడ్డు లోని ఆయన కాంస్య విగ్రహానికి ఎస్ఐ నాగ చిరంజీవి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక విప్లవకారుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు మరువలేను అన్నారు, స్త్రీ విద్య కోసం, సమాజంలో సమానత్వం కోసం నిరంతరం పోరాడిన ధీశాలి పూలే. అట్టడుగు వర్గాలకు విద్యే గొప్ప ఆయుధమని నమ్మి, సమాజంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన ఆయన ఆశయాలు నేటికీ మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ, వారి సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ వెంకటేష్, హోంగార్డు సుధాకర్, నాగరాజా, సత్తార్, పలువురు ప్రజా సంఘాల నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర రాష్ట్ర దొంగలు అరెస్టు
రూ.4.70 లక్షల విలువ గల సొత్తు స్వాధీనం
మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 11) దేవాలయాలలో చోరీలకు పాల్పడుతున్న అంతరరాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. మహారాష్ట్ర కు చెందిన ఐదుగురు అంతరాష్ట్ర వ్యక్తులు చిన్న చిన్న కూలి పనులు చేసుకుంటూ సంపాదించే డబ్బు తమ విలాసాలకు సరిపోకపోవడంతో, ఒక మూఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడటం ప్రారంభించారు. ఏప్రిల్ 1వ తేదీన జె పంగులూరు మండలం రామకూరు గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం తాళాలు పగులగొట్టి, గుడిలోని సుమారు 7 కిలోల వెండి, 19 గ్రాముల బంగారు ఆభరణాలు (మొత్తం విలువ రూ.3,50,000) దొంగిలించారు. అనంతరం లారీలో ఒంగోలు వైపు వెళ్తూ అదే రాత్రి రేనంగివరం గ్రామంలోని త్రిశక్తి పీఠం గుడి వద్దకు వెళ్లి, తాళాలు పగులగొట్టి గర్భగుడిలో ఉన్న మూడు దేవతల వద్ద ఉన్న సుమారు 2 కిలోల వెండి కిరీటాలను దొంగిలించారు. అలాగే వీరు 23.02.2026 ఉదయం మదనపల్లెటౌన్‌లో హైవే సమీపంలోని శ్రీకృష్ణుడి ఆలయంలో కూడా వెండి, బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. తన స్వీయ పర్యవేక్షణలో దర్శి ఎస్‌డిపిఓ మార్గదర్శకత్వంలో అద్దంకి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి మల్లికార్జునరావు, సిసిఎస్ సిఐ భీమా నాయక్, ఫింగర్ ప్రింట్ సిఐ కె రవీంద్రరెడ్డి, జె పంగులూరు ఎస్ఐ బి వినోద్ బాబు, మేదరమెట్ల ఎస్ఐ ఎస్‌కే మహమ్మద్ రఫీ, కొరిశపాడు ఎస్ఐ వై సురేష్ తదితర సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పాటు నేరస్థలంలో సేకరించిన ఆధారాలు, అందిన సమాచారం పై దృష్టి సారించి శనివారం అద్దంకి మండలం సింగరకొండ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని పొలాల వద్ద మహారాష్ట్రకు చెందిన అనికేత్ కైలాస్ కసరోడే, సునీల్ దేవరావు సూర్యవంసి, మనీష్ గోపాల్ వడివే అనే ముగ్గురిని, చట్టంతో సంఘర్షణ పడిన ఇద్దరు బాలురలను అద్దంకి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి మల్లికార్జునరావు అరెస్ట్ చేశారన్నారు. వారి వద్ద నుంచి రామకూరు శ్రీ రామలింగేశ్వర స్వామి గుడిలో దొంగిలించిన వెండి చేతులు 2, వెండి చెవులు 2, వెండి కిరీటం 1, వెండి తొండం 1, మరికొన్ని వెండి ఆభరణాలు సుమారు 7 కిలోలు, బంగారు మంగళ సూత్రాలు 12, మారేడు బిల్వం 1, తెల్ల రాళ్లు 4, ఎర్ర రాయి 1 కలిగిన బంగారపు ముక్కుపుడక 1, బంగారపు ముక్కుపుడక 1, చుట్టూ తెల్ల రాళ్లు మధ్యలో 2 ఎర్రరాళ్ళు కలిగిన బంగారపు బొట్టు 1, బంగారపు ముత్యాల దండ పతకం ఒకటి, తెల్లరాయి మధ్యలో ఎర్రరాయి బంగారు పతకం ఒకటి మొత్తం బరువు సుమారు 19 గ్రాములు ఉన్నాయన్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.4,70,000 అని తెలిపారు. రేనంగివరం గ్రామములోని త్రిశక్తి పీటం గుడిలో దొంగిలించిన 2 కేజీల వెండి కిరీటాలు, లక్ష రూపాయల విలువ కల్గినవి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. దేవాలయాలలో భద్రతను దృష్టిలో ఉంచుకుని ముఖ్య ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. కెమెరాలకు సంబంధించిన డివిఆర్‌లను ఎత్తైన, లేదా భద్రమైన ప్రదేశాల్లో అమర్చుకోవాలని తెలిపారు. అలాగే కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తరచుగా పరిశీలిస్తూ, రికార్డింగ్ డేటా కొన్ని రోజుల పాటు నిల్వ ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందనలు : కేసును చేధించుటలో విశేష ప్రతిభ చూపిన దర్శి ఎస్‌డిపిఓ, అద్దంకి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి మల్లికార్జునరావు, సిసిఎస్ సిఐ ఎం భీమా నాయక్, ఫింగర్ ప్రింట్ సిఐ కె రవీంద్రరెడ్డి, జె పంగులూరు ఎస్ఐ బి వినోద్ బాబు, మేదరమెట్ల ఎస్ఐ ఎస్‌కె మహమ్మద్ రఫీ, కొరిశపాడు ఎస్ఐ వై సురేష్, వారి సిబ్బంది ఏఎస్ఐ నగేష్ బాబు, పిసిలు జె వెంకటరావు, జె మత్తయ్య, ఎస్ వెంకటేశ్వర్లు, దిలీప్ కుమార్, పి సూర్యప్రకాష్, మేదరమెట్ల పిసి జి సురేష్, హెంగార్డు కె సురేంద్ర, కె లక్ష్మినారాయణలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

మహాత్మా జ్యోతిబాపూలేకు ఘన నివాళులు



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఏప్రిల్ 11)

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, మహానుభావుడు, సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని సిద్ధవటం రోడ్డులోని పూలే విగ్రహానికి పూలమాల వేసి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహాత్మా పూలే గారు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, సమాన హక్కుల సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. సమాజంలో కుల వివక్షను నిర్మూలించి సమానత్వాన్ని నెలకొల్పడంలో ఆయన చేసిన సేవలు అపారమని తెలిపారు. అలాగే, తన సహచరిణి సావిత్రీబాయి పూలే గారితో కలిసి 1848లో బాలికల కోసం దేశంలోనే తొలి పాఠశాలను స్థాపించి మహిళా సాధికారతకు బాటలు వేసిన మహోన్నత వ్యక్తిగా కొనియాడారు. మహాత్మా పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి సమాన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ నాయకులు డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్, ఓబుల రెడ్డి రమణ రెడ్డి, కొంకుల రాంబాబు, జహంగీర్ భాష, మాచుపల్లి కృష్ణారెడ్డి, పరిటాల వెంకట సుబ్బయ్య, బిజీవేముల చంద్రశేఖర్ రెడ్డి, బిజీవేముల రమణారెడ్డి, బోవిళ్ళ నరసింహారెడ్డి, ఓబుల్ రెడ్డి శ్రీనివాసుల రెడ్డి, చిన్నప్పు రెడ్డి, పఠాన్ మౌలాలి, రసూల్, పాటూరు నరసింహ రెడ్డి, సిమెంట్ షరీఫ్, భాస్కర్ నాయుడు, నరసింహ రెడ్డి, గంగిపోగు నరసింహులు, ఉపత్తి సుబ్బా రెడ్డి, గురుప్రసాద్ రెడ్డి, గంగాధర్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, బ్రహ్మదండ శ్రీనివాసులు, కోటపాటి పెంచలయ్య, అందురు వెంకట సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొదటి బ్యాచ్ జనాభా గణన పై శిక్షణా తరగతులు పూర్తి



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 11)

మండల కేంద్రం అయిన ఉలవపాడులోని గవర్నమెంటు హై స్కూల్ నందు జనగణన 2027లో భాగంగా మొదటి బ్యాచ్ ఎనిమిరేటర్లు, సూపర్వైజర్‌లకు మూడవ రోజు ఇండ్ల జాబితా గణన పై శిక్షణా తరగతులు పూర్తి చేశారు. సెన్సస్ చార్జ్ ఆఫీసర్ అయిన తహశీల్దారు ఏవి రవి శంకర్ శిక్షణా కేంద్రాన్ని సందర్శించి శిక్షకులకు తగు సూచనలు చేశారు. అలాగే నమూనా ఇండ్ల జాబితా గణనలో భాగంగా ఉలవపాడు మండల కేంద్రంలోని అలగాయపాలెం రోడ్ నందు కొన్ని గృహములను మొదటి బ్యాచ్ ఎన్యూమరేటర్‌లు, సూపర్వైజర్‌లు హెచ్ఎల్ఓ యాప్ నందు ఏ విధంగా సమాచారాన్ని నమోదు చేస్తున్నారో పరిశీలించారు. ఫీల్డ్ ట్రైనర్‌లు పున్నేపల్లి శ్రీనివాసులు, షేక్ బాబ్జీ



ఉదయం శిక్షణా తరగతులలో భాగంగా హెచ్ఎల్ఓ యాప్ నందు ఇండ్ల జాబితా గణన లో అడిగే ప్రశ్నలు ఏ విధంగా నమోదు చేయాలో వివరించారు. మొదటి బ్యాచ్ వారిని మూడు టీమ్‌లుగా చేసి నమూనా ఇండ్ల జాబితా గణన నిర్వహించారు. మధ్యాహ్నం ఎనిమిరేటర్‌లు, సూపర్వైజర్లకు హెచ్ఎల్ఓ యాప్ నందు వచ్చే సందేహాలకు వివరణ ఇచ్చారు. అలాగే మొదటి బ్యాచ్ వారికి ఏవిధంగా శిక్షణా తరగతులు నిర్వహించారో మొదటి బ్యాచ్ వారి దగ్గర నుండి అభిప్రాయం తీసుకోవడం జరిగింది. సమాచారం సేకరించేటప్పుడు నాణ్యత గల సమాచారాన్ని సేకరించాలని తద్వారా ఖచ్చితమైన నివేదికలు ప్రభుత్వానికి అందించిన వారము అవుతామని తెలియపరిచారు. అనంతరం



సామాజిక సమానత్వ స్ఫూర్తికి ప్రతీక జ్యోతిరావు పూలే

యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు
200వ జయంతి సందర్భంగా పూలేకు యుటిఎఫ్ ఘన నివాళి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 11)

సామాజిక సమానత్వ స్ఫూర్తికి ప్రతీక మహాత్మ జ్యోతిబాపూలే అని రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పేర్కొన్నారు. జ్యోతిబాపూలే 200వ జయంతిని పురస్కరించుకుని శనివారం ఉదయం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఒంగోలులోని యుటిఎఫ్ జిల్లా కేంద్ర కార్యాలయం లో జ్యోతిరావు పూలే పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమ్మజు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సామాజిక అసమానతలు, కుల వివక్ష, మూఢనమ్మకాల వంటి అన్యాయాలపై నిరంతరం పోరాడిన గొప్ప యోధుడని కీర్తించారు. తన జీవితాన్ని పూర్తిగా సమాజానికే అంకితం చేసిన మహానీయుడని, ముఖ్యంగా మహిళల విద్య కోసం, దళితుల అభ్యున్నతి కోసం నిరంతరం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. విద్యే సమాజ మార్పుకు ప్రధాన మార్గమని భావించిన పూలే బాలికల విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా, తన జీవిత సహచరిణి సావిత్రిబాయి పూలే తో కలిసి బాలికల విద్యకు శ్రీకారం చుట్టడం ద్వారా భారతదేశంలో ఒక కొత్త యుగాన్ని ప్రారంభించారన్నారు. సత్యశోధక్ సమాజ్ అనే సంస్థను స్థాపించి సమాజంలో సమానత్వం, సత్యం, న్యాయం కోసం కృషి చేశాడన్నారు. సత్యశోధక్ సమాజ్ ద్వారా కుల వివక్షతను తీవ్రంగా నిరసించడమే కాకుండా ప్రతి మనిషి సమానమేననే భావనను ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేశాడన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్ రవి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిదని, బాల్య వివాహాలను వ్యతిరేకించడంతోపాటు, వితంతు పునర్వివాహాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేశారని తెలిపారు. మహిళలకు సమాజంలో గౌరవం, స్వేచ్ఛ, సమాన హక్కులు ఉండాలని నినదించారని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టిన సేవాతత్పరుడన్నారు. సామాజిక సంస్కర్తగా, విద్యావేత్తగా, మానవతావాదిగా ఆయన చేసిన కృషి నేటి సమాజానికి ఆదర్శమని, నేటి పాలకులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు పూలేను స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో నేటికీ కొనసాగుతున్న అసమానతలు, కుల వివక్షత, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఉద్యమించడంతోపాటు, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా కృషి చేయడం, మహిళా సాధికారతకు పాటుపడటం కోసం నేటి యువత, సామాజిక చైతన్యం కలిగిన ఉపాధ్యాయ లోకం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయడమే పూలేకు మనం అర్పించే ఘనమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఆదర్శం తీసుకొని ఉపాధ్యాయులకు ఉద్యోగులకు సామాజిక భద్రత అయిన పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వై వెంకట్రావు, జిల్లా సహాధ్యక్షురాలు జి ఉమా మహేశ్వరి, జిల్లా కోశాధికారి ఎన్ చిన్న స్వామి, ఆల్ పెన్షనర్స్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవి శేషయ్య, సిహెచ్ రాంబాబు, టీవీఎస్ సుబ్బారావు, కే హనుమంతురావు, ఆర్ రంగనాయకులు, నల్లూరి వెంకటేశ్వరరావు, టీవీ రమణమూర్తి, శేషగిరిరావు, నారాయణ, జి శ్రీనివాసరావు, షేక్ అబ్దుల్ ఖాదర్, జిలాని, తదితరులు పాల్గొన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

కొండమూరులో విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ







అభివృద్ధి పనుల ప్రారంభం, టిడ్కో ఇళ్లపై మంత్రి గొట్టిపాటి సమీక్ష

విద్యార్థులకు ప్రయాణ భారం తగ్గించేందుకే సైకిళ్ల పంపిణీ

దాతల సాయంతో 10,874 మంది విద్యార్థులకు ఉచితంగా అందజేత

దెబ్బతిన్న టిడ్కో ఇళ్లను పునరుద్ధరిస్తున్నాం

మినీ బైపాస్ నిర్వాసితులకు మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉన్నాం

ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 11)

అద్దంకి:ప్రయాణ భారంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎవరూ విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో అద్దంకి నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. శనివారం ఉదయం జె పంగులూరు మండలం, కొండమూరు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి గొట్టిపాటి రవి కుమార్, కలెక్టర్ రాజాబాబుతో కలసి ప్రారంభించారు. తొలుత ముప్పవరం ఆర్ అండ్ బి రోడ్డు నుంచి కొండమూరు వరకు రూ. 45 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును, రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, సైడు కాలువలను ప్రారంభించారు. అనంతరం రూ. 40 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ రాజాబాబుతో కలసి జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సరస్వతి అమ్మవారి విగ్రహాన్ని ప్రారంభించడంతో పాటు మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకుని జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల చెందిన 100 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను







పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రయాణ భారంతో విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో నియోజకవర్గ పరిధిలో విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. కొన్ని కంపెనీల సీఎస్ఆర్ నిధులు, దాతలు అందించిన సహకారంతో విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు పుస్తకాలు, మంచి యూనిఫాం, షూలు, బ్యాగులు అందించామని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. విద్యార్థులు కూడా మంచిగా చదివి పాఠశాలతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. విద్యార్థులకు విద్యను అందించేందుకు ఉపాధ్యాయుల కొరత ఉండరాదన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం 16 వేల మంది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరిగిందన్నారు. ఈ స్కూల్ లో 150 మంది విద్యార్థులకు 11 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని.. విద్యతోనే అభివృద్ధి సాధ్యం అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. దాతల సహకారంతో ఇప్పటివరకు నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న సుమారు 10,874 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తగా వెళ్లాలని, తల్లిదండ్రులు కూడా శ్రద్ధ తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. అనంతరం మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అద్దంకి సమీపంలో నిర్మిస్తున్న టిడ్కో భవనాలను స్వయంగా వెళ్లి పరిశీలించారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం మరింత వేగంగా పూర్తి కావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందించే ఇళ్ల విషయంలో ఎలాంటి నాణ్యతా లోపం ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి గొట్టిపాటి.... 2014లో అద్దంకి నియోజకవర్గం పరిధిలో సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో 960 మందికి ఇళ్లను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అయితే, తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని నిలిపివేసిందని ఆరోపించారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభించామని వివరించారు. సరైన నిర్వహణ లేక కొన్ని చోట్ల దెబ్బతిన్న టిడ్కో ఇళ్లతో పాటు మౌలిక సదుపాయాలు కూడా దెబ్బతిన్నాయని మంత్రి తెలిపారు. వాటిని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని అవసరాలను పునరుద్ధరిస్తామని ఈ మేరకు హామీ ఇచ్చారు. అనంతరం సింగరకొండ సమీపంలో మినీ బైపాస్ నిర్వాసితులైన 80 మందికి రెండు సెంట్ల చొప్పున ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని మంత్రి వివరించారు. వీరికి స్థిర నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. త్వరలోనే ప్రతి ఇంటికి విద్యుత్ కనెక్షన్, మంచినీటి సదుపాయాలను అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిబాపూలేకు ఎమ్మెల్యే ఇంటూరి ఘననివాళి





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 11)

సంఘసంస్కర్త, సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి సందర్భంగా కందుకూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మా జ్యోతిరావు పూలే నిస్వార్థమైన విశేష సేవలు అందించారని అన్నారు. జీవిత చరమాంకంలో అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ ప్రజాసేవ కోసం పరితపించారని తెలిపారు. స్త్రీలకు విద్య నేర్పేందుకు సావిత్రీబాయి పూలేతో కలిసి గొప్ప కార్యక్రమానికి తన ఇంటినుంచే శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే చెప్పారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని నాగేశ్వరరావు సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర ముస్లిం మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, నియోజకవర్గ వాణిజ్య విభాగ కమిటీ అధ్యక్షుడు మోదడుగు వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పులి నాగరాజు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు వేణు, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అహ్మద్, పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీను, రాయపాటి శ్రీను, భవనాసి వెంకటేశ్వర్లు, గుమ్మా శివ, మచ్చా మనోహర్, శ్యామ్, ఫిరోజ్, చెంచు నారాయణ, రమణయ్య, శివరామకృష్ణ, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష ప్రోత్సాహానికి కృషి

ఎంపి మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 11)

తెలుగు భాష ప్రోత్సాహానికి కృషి చేస్తామని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షులు విల్సన్ శరత్ చంద్ర సంచాలకత్వంలో ముద్రించిన ఉషాబాల బాలల మాస పత్రికను ఒంగోలు నెక్ట్ జన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఎంపీ ఆవిష్కరించి ఎమ్మెల్యేకు తొలి ప్రతిని అందజేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఒంగోలులో డిసెంబరులో జరగనున్న 4వ ప్రపంచ బాలల తెలుగు మహాసభల్లో భాగంగా మాస పత్రిక ఆవిష్కరించారు. తాను రైలులో ప్రయాణించే సమయంలో చందమామ, బాలమిత్ర పుస్తకాలను చదివేవాడినని, ప్రస్తుత పరిస్థితుల్లో ఆ పుస్తకాలకు ఆదరణ తగ్గిందని ఎంపీ మాగుంట అన్నారు. పిల్లలకు తెలుగుభాష, విలువలు తెలియజేసేలా తల్లిదండ్రులు వారిచేత పుస్తకాలు చదివించాలని సూచించారు. తెలుగు భాష ప్రాముఖ్యతను తెలియజేసేందుకు గజల్ శ్రీనివాస్ ప్రపంచ మహాసభలు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అభినందించారు. తెలుగు భాష ప్రాధాన్యత తగ్గిపోతుందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తరచూ ఆవేదన వ్యక్తం చేస్తుంటారని గుర్తు చేశారు. ప్రతి పాఠశాలలో తెలుగు భాష అమలు జరిగేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకున్నారని తెలిపారు. తెలుగు భాష వికాసానికి ప్రతి ఒక్కరూ కంకణబద్దులు కావాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా 7 వేల భాషలు ఉన్నాయని తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షులు విల్సన్ శరత్ చంద్ర అన్నారు. భారతదేశంలో రాజ్యాంగం గుర్తించిన 22 భాషల్లో తెలుగు భాష ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. అయితే మాతృభాషపై చిన్న చూపు పడుతుందని, ఎందుకంత నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఒక రకంగా చూస్తే అందరం దోషులమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో తెలుగు వారంతా ఒకచోట కలిసే విధంగా ప్రపంచ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు గజల్ శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ నిధులతో కాకుండా దాతల సహకారంతో వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒంగోలులో జరిగే బాలల ప్రపంచ తెలుగు మహాసభలకు 40 దేశాల నుండి వేలాదిమంది బాలలు హాజరవుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, నెక్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరక్టర్లు డాక్టర్ మురళీధర్‌రెడ్డి, శ్రీకాంత్, ఎఎంసి చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలి



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 11)

మండలంలోని పెద్ద వెంకన్నపాలెం అంగన్వాడి కేంద్రంలో శనివారం ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వాన ఆధ్వర్యంలో పోషణ పక్వాడ పై అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. రిజ్వానా మాట్లాడుతూ తల్లి గర్భధారణ నుండి బిడ్డకు రెండు సంవత్సరాల కాలవ్యవధిని స్వర్ణమ దశ మొదటి 1000 రోజులు అంటారని, ఈ దశ తల్లి బిడ్డ ఆరోగ్యానికి అత్యంత కీలకమని, తల్లి గర్భవతిగా ఉన్నప్పుడు మంచి పౌష్టికారం, డాక్టర్ సూచనలు మేరకు ఐరన్ క్యాల్షియం టాబ్లెట్స్ హెల్త్ చెకప్ పాటించాలని తెలిపారు. తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, బిడ్డకు ఆరు నెలలు అదనపు ఆహారం ఇవ్వాలని సూచించారు. పిల్లలకు జంక్ ఫుడ్ కాకుండా ప్రోటీన్ ఫుడ్స్ అందించాలని తెలిపారు. అనంతరం పెద వెంకన్నపాలెం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో విప్పగుంట సచివాలయం పరిధిలో ఉన్న అంగనవాడి కార్యకర్తలు వణిజకుమారి ప్రభావతి శ్రీదేవి ప్రసన్న నారాయణమ్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి రామకృష్ణ, ఉపాధ్యాయురాలు సృజన, తదితరులు పాల్గొన్నారు.

పిఎండిఎస్ కిట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, ఏప్రిల్ 11)

నవధాన్యాలు పీఎండీఎస్ విత్తనాలను రైతులందరూ వినియోగించుకొని తమ సాగు పొలాలను సారవంతం చేసుకోవటమేకాక ఆరోగ్యకరమైన ధాన్యం ఉత్పత్తి చేయ్యవచ్చని క్లస్టర్ ఇంచార్జ్ బి వెంకటస్వామి అన్నారు. శనివారం మండలంలోని వంకాయలపాడు గ్రామం నందు బయో ఇన్ పుట్ రీసర్చ్ సెంటర్ వారి ఆధ్వర్యంలో జయ లక్ష్మి ఇంటి వద్ద రైతుల సమక్షంలో నవధాన్యాల పచ్చిరొట్ట కిట్స్ ను 18 రకాల విత్తనాలతో కూడిన 15 కేజీల సంచులను రైతులకు అందించే నిమిత్తం ఉంచటం జరిగింది. ఇ సందర్భంగా క్లస్టర్ ఇంచార్జ్ బి వెంకటస్వామి కార్యక్రమంలో పాల్గొని రైతులతో మాట్లాడుతూ ఈ నవధాన్యాలు పీఎండీఎస్ విత్తనాలను రైతులందరూ వినియోగించుకొని తమ పొలాలలో సాగు చేసుకోవాలని కోరారు.విటి సాగు వలన భూమిలో కార్బన్ శాతం పెరిగి పంటలు ఆరోగ్యవంతగా మారి నాణ్యమైన దిగుబడులు వచ్చి మంచి ఆరోగ్యకరమైన ఆహారం సమకూరి, ప్రజలకు ఆరోగ్యవంతమైన ఆహారం అందుతుందన్నరు. రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గి అధిక ఆదాయం సమకూరుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు రామిరెడ్డి, గాంధీరెడ్డి, వెలుగు సిబ్బంది సిసి రాజశేఖర్, ఏపిసి హెచ్ఎన్ఎఫ్ సిబ్బంది చిన్న, నవ్య, సుభాషిణి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com

ఎస్ఐ శివ కృష్ణారెడ్డి పర్యవేక్షణలో ప్రైవేట్ బస్సుల విస్తృత తనిఖీలు





(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 11)

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కంభం పరిధిలోని ఎన్‌హెచ్-544డి జాతీయ రహదారిపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై కంభం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ శివ కృష్ణారెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ డ్రైవ్‌లో బస్సుల పత్రాలు, ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై శివ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ ఎల్ఈడీ లైట్ల పై ఎస్ఐ శివ కృష్ణారెడ్డి కఠిన చర్యలు

పలు వాహనాల ఎల్ఈడి లైట్లను ధ్వంసం చేసిన ఎస్ఐ



(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 11)

కంభం పరిధిలోని ఎన్‌హెచ్ 544డి జాతీయ రహదారిపై వాహనాల్లో అక్రమంగా అమర్చిన ఎల్ఈడి లైట్లపై కంభం పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఎస్ఐ శివ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు.నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఎల్ఈడీ లైట్లను గుర్తించి అక్కడికక్కడే తొలగించి ధ్వంసం చేశారు. రాత్రి సమయంలో అధిక కాంతి వల్ల ఇతర వాహనదారులకు ప్రమాదం కలుగుతుందని పోలీసులు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల తనిఖీ
అంగన్వాడీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

ఎంఈవో అబ్దుల్ సత్తార్





(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 11)

స్థానిక ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాల, ఎబిఎం, ఎస్సీజి పాలెంలోని అంగన్వాడీ కేంద్రాలను శనివారం ఎంఈవో అబ్దుల్ సత్తార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యా కేంద్రాల్లో బోధన విధానం, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, భోజనం రుచి, నాణ్యతా ప్రమాణాలు పరిశీలించారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషకాహారం, హాజరు రిజిస్టర్, సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 5 సంవత్సరాలు నిండిన అంగన్వాడీ చిన్నారులను తప్పనిసరిగా సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని చెప్పారు. చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అంగన్వాడీ నుండి ప్రభుత్వ పాఠశాలకు అప్గ్రేడ్ చేయడంసరైన నిర్ణయమన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు రావాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో సిఆర్పీ మురళీమోహన్, ఉపాద్యా యులు, అంగన్వాడీ కార్యకర్త ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ పుణ్యక్షేత్రంలో కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు











(షణ్ముఖ వెలుగు, వలేటివారిపాలెం, ఏప్రిల్ 11)

మండలంలోని మాలకొండ పుణ్యక్షేత్రంలో శనివారం జరిగిన పలు కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. అనంతరం దేవాదాయ, ధర్మాదాయ శాఖ, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధార్మిక సదస్సులో ట్రస్ట్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ దాసరి శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ హిందూ ధర్మంపై ముప్పేట దాడి జరుగుతోందని, హిందువులందరూ కలిసికట్టుగా ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా ముఖ్యమైన దేవాలయాల్లో ఇలాంటి సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కొత్త దేవాలయాలను నిర్మించడం, పురాతన దేవాలయాల జీర్ణోద్ధరణ, ధార్మిక సదస్సులు, ప్రచార కార్యక్రమాలు, అర్చకులకు జీతాలు, ఆలయాలకు ధూపదీప నైవేద్యాలకు నిధులు విడుదల లాంటి కార్యక్రమాలను చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేపడుతోందని వివరించారు. కనిగిరి ఆర్డీవో ఎం శివరామిరెడ్డి, దేవాదాయ శాఖ ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ, ఈవో చంద్రశేఖర్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఉప్పుటూరి కొండపనాయుడు, రిటైర్డ్ డిఈ మంచిరాజు మురళీమోహన్, రిటైర్డ్ హెచ్ఎం ఆర్ వెంకటేశ్వర్లు తదితరులు ధార్మిక సదస్సులో మాట్లాడారు. పలువురు భక్తులకు భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. అంతకుముందు మాలకొండలో రూ. 4 లక్షలతో పామూరు మండలానికి చెందిన దాతలు యలమూరి శేషగిరిరావు ప్రతిమ దంపతులు నిర్మించిన పోలీస్ అవుట్ పోస్ట్‌ను ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రారంభించారు. ధార్మిక సదస్సు అనంతరం దాసరి శ్రీనివాసులు, ఎమ్మెల్యే నాగేశ్వరరావు తదితరులు స్వామి, అమ్మవార్లు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పండితులు, అధికారులు వారికి స్వాగతం పలికారు. తర్వాత అన్నదాన సత్రంలో భక్తులతో మాట్లాడి ప్రసాదాల నాణ్యత గురించి ఆరా తీశారు. కొండకింద లడ్డుప్రసాదం ట్రేలు ప్లాట్ ఫారంను ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రారంభించారు. హైదరాబాద్ కు చెందిన చేబ్రోలు బాబూరావు, సుజాత దంపతులు, వారి కుమారులు మధుసూదన్, మణిదీప్ పేరు మీద రూ. 12.5 లక్షలు ఖర్చుచేసి దీనిని నిర్మించారు.

అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

మాలకొండ పై దేవస్థానం దుకాణాలు కాకుండా, ఇతరులు అనధికార షాపులు నిర్వహిస్తుండాన్ని ఎమ్మెల్యే గమనించారు. అమ్మవారి ఆలయం దగ్గర కూడా అదే పరిస్థితి చూశారు. గతంలో అనేకసార్లు వీటిని తొలగించాలని సూచించినప్పటికీ ఎందుకు పట్టించుకోవడంలేదని ఈవో చంద్రశేఖర్ పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా మీరు మారరా అంటూ అసహనం వ్యక్తం చేశారు. అలాగే కొండ క్రింద వాహనదారుల దగ్గర అధిక రేట్లు వసూలు చేస్తుండగా ఎమ్మెల్యే ప్రత్యక్షంగా గమనించి పాటదారులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. దేవస్థానం సూచించిన రేట్లు మాత్రమే వసూలు చేయాలని గట్టిగా మందలించారు. అధికారులు ప్రతివారం తప్పనిసరిగా తనిఖీలు చేసి అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమాల్లో మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నేతలు పెగడ శ్రీనివాసులు, కాకుమాని హర్ష, కామినేని అశోక్, మోహన్, శనివారపు మాల్యాద్రి, కూడలి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిబాపూలే ఆశయాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం కావాలి

జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 11)

విద్య ద్వారానే మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరని ముందుగానే గుర్తించిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా శనివారం ప్రకాశం జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులు కలిసి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జ్యోతిబాపూలే గొప్ప సంఘసంస్కర్తగా, సామాజిక తత్వవేత్తగా, మహిళా అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన ఆదర్శప్రాయుడని కొనియాడారు. సతీసహగమనం, అంటరానితనం వంటి సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడి, కుల వ్యవస్థ నిర్మూలనకు పాటు పడ్డారన్నారు. బాలికలు, ముఖ్యంగా మహిళల విద్యాభివృద్ధికి సామాజిక చైతన్య కార్యక్రమాలు చేపట్టారని, వితంతువుల పట్ల వివక్షను ఖండించారని, బడుగు, బలహీన వర్గాలు ఆర్థికంగా,సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి కోసం, మానవ హక్కుల కోసం పోరాడిన మహోన్నత ఉద్యమకారుడన్నారు. జ్యోతిరావు పూలే గారు బాలికల విద్య కోసం మొట్టమొద్దటి పూనాలో పాఠశాలను ప్రారంభించారు. ఆయన స్ఫూర్తితోనే ఎంతోమంది మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గుర్తుచేశారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 1888లో "మహాత్మా" బిరుదు లభించిందని తెలిపారు. ఆయన ఆశయాలను, ఆయన తీసుకొచ్చిన సామాజిక చైతన్యాన్ని మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, ఆర్ఐ సీతారామిరెడ్డి, రమణరెడ్డి, ఎఆర్ ఎస్ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట జూదరులు 17 మంది అరెస్టు
రూ.63,750 నగదు స్వాధీనం



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 11)

పట్టణంలోని మాధవి గ్రాండ్ ఇన్ హోటల్ నందు పేకాట ఆడుతున్నట్లు జిల్లా టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ కోటి నాయక్ ఇచ్చిన సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ వి వేమన, అర్థవీడు ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.63,750 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ఒంగోలులో నాలుగు పుస్తకాల ఆవిష్కరణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 11)

ప్రముఖ సాహిత్యవేత్త డాక్టర్ రామచంద్రుని రమేష్ కృష్ణ షష్టిపూర్తి మహోత్సవాన్ని పురస్కరించుకొని రమేష్ కృష్ణ రచించిన నాలుగు గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఈ నెల 12 వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఒంగోలు రాజీవ్‌నగర్ లోని శ్రీ సత్య శ్రీనివాస సదన్ లో జాతీయ సాహిత్య సాంస్కృతిక సమితి, అవసర ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో నిర్వహిస్తున్నట్లు సమితి ప్రకాశం జిల్లా శాఖ కన్వీనర్ యంవియస్ శాస్త్రి ఒక ప్రకటనలో తెలియచేశారు. డాక్టర్ రమేష్ కృష్ణ రచించిన శ్రీ ఆశ్చర్యరామాయణం (తెలుగు), బాలవాల్మీకిరామాయణ్ (హిందీ), బాలమహాభారత్ (హిందీ), బాలభాగవత్ (హిందీ) గ్రంథాలను అతిథులు ఆవిష్కరిస్తారని తెలిపారు. ప్రముఖ హరికథా కళాకారిణి పద్మశ్రీ డి ఉమామహేశ్వరి, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారగ్రహీత డాక్టర్ కళాకృష్ణ, ఆంధ్ర సారస్వతపరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్, అవధానధుని, జాతీయ సాహిత్య పురస్కార గ్రహీత సురభి శంకరశర్మ, రాష్ట్రపతి బాదరాయణ సమ్మాన్ పురస్కార గ్రహీత డాక్టర్ అద్దంకి శ్రీనివాస్, విశ్రాంత సంస్కృతోపన్యాసకులు కిడాంబి భక్తవత్సలం, గౌరవ అతిథులుగా, గ్రంథావిష్కర్తలుగా పాల్గొంటారని యంవియస్ శాస్త్రి తెలిపారు. సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.